ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 177 | శుక్రవారం 27 మార్చి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

# బస్సు ప్రమాదం ఘోరం



## టిప్పర్‌ను ఢీకొని మంటల్లో దగ్ధం

### 13 మంది మృతి.. పలువురికి తీవ్ర గాయాలు

**మార్కాపురం (తెలుగోడు), మార్చి 26 :**

మార్కాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతో పాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 13 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున ఆరుగంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని 2లో

## ప్రధాని, సీఎం దిగ్భ్రాంతి



మార్కాపురం సమీపంలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని (మిగతా 2లో)



మార్కాపురం వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై మంత్రులు అనిత, జనార్థన్ రెడ్డితో పాటు పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. (మిగతా 2లో)

# విధ్వంసకర ఎత్తులేస్తున్న ఇరాన్



### ఖర్గ్‌ను రక్షించుకునేందుకు సిద్ధం..

### శత్రుమూకలను అంతం చేసే దిశగా భారీగా మందుపాతరలు...

**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 26 :**

ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్ ను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా తన బలగాలను మోహరిస్తోందని వార్తలు వస్తున్న ఈనేపథ్యంలో ఖర్గ్‌ను రక్షించుకునేందుకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం అమెరికా దళాలను అక్కడ అడుగుపెట్టనీయకుండా ఇరాన్ భారీగా మందుపాతరలు అమర్చినట్లు సమాచారం. వాటితో విధ్వంసకర ఉచ్చులు పన్నుతోందని తెలుస్తోంది. అంతేకాకుండా అక్కడికి భారీగా బలగాలను కూడా తరలిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనం (మిగతా 2లో)

# తెరుచుకున్న హోర్ముజ్



### సరుకు రావాణాకు ఇరాన్‌అనుమతి

**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 26 :**

భారత్‌తో సహా మిత్ర దేశాలకు హోర్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ ద్వారా సరుకు రవాణా నౌకల రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ప్రకటించారు. భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లకు సరుకు రవాణాకు అనుమతి లభించింది. అబ్బాస్ అరఘ్చి స్పందన గురించి ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అభ్యర్థించారు. దీని నేపథ్యంలోనే ఇరాన్ ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించాలని గుటెర్రెస్ అమెరికా, ఇజ్రాయిల్‌లను కోరారు. 'హోర్ముజ్ జలసంధిని మూసివేయడం చమురు, గ్యాస్ రవాణాను స్తంభింపజేస్తోంది. ఈ ప్రాంతంలో, 2లో

# మృతులకు కేబినెట్ సంతాపం

### మృతుల కుటుంబాలకు 5లక్షల చొప్పన పరిహారం...

### క్షగాత్రులకు 2 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయం...



**అమరావతి (తెలుగోడు), మార్చి 26 :**

మార్కాపురంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ఏపీ కేబినెట్ భేటీలో చర్చించారు. మృతుల కుటుంబాలకు మంత్రివర్గం ప్రగాఢ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా బస్సు ప్రమాద బాధితులకు ఏపీ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. బస్సు ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బస్సు ప్రమాదంలో 14 మంది సజీవ దహనం అయ్యారు. ప్రైవేటు బస్సు,టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 14 మంది చనిపోగా.. 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

# శాశ్వత రాజధానిగా అమరావతి

- రాజధాని చట్టబద్ధతకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్..
- భవిష్యత్తులో మార్పులకు చెక్ పెట్టేలా తీర్మానం..
- న్యాయ వ్యవస్థ బలోపేతానికి కొత్త కోర్టులు, ఉద్యోగాలు..
- పోలవరం పరిహారం పెంపు, అభివృద్ధి పనులకు ఊతం..
- ప్రజా భద్రత, వసతుల విస్తరణపై దృష్టి....

**అమరావతి (తెలుగోడు),మార్చి 26 :**

రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించేందుకు చట్ట సవరణలు చేపట్టాలని నిర్ణయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. భవిష్యత్తులో రాజకీయ కారణాలతో రాజధానిని మార్చే అవకాశాన్ని పూర్తిగా నిలిపివేయాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం తీసుకురానుంది. గతంలో జరిగిన పరిణామాలతో అమరావతి అభివృద్ధి దెబ్బతిన్నదని పేర్కొంటూ, ఇకపై దాన్ని రాష్ట్ర ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా స్పష్టం చేసింది. న్యాయ వ్యవస్థ బలోపేతానికి పెద్దపీట వేస్తూ కొత్త కోర్టుల ఏర్పాటు, ఉద్యోగాల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 96 కోర్టులు ఏర్పాటు చేసి, 1730 ఉద్యోగాలను భర్తీ (మిగతా 2లో)



## నగరాల్లో సిలెండర్లకు బదులు పైప్ గ్యాస్

### పది లక్షల కొత్త కనెక్షన్ల లక్ష్యం..

### 24 గంటల్లో పైప్‌లైన్ అనుమతులు..

### కేబినెట్ గ్రీన్ సిగ్నల్..



**అమరావతి (తెలుగోడు),మార్చి 26 :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పైప్డ్ గ్యాస్ వినియోగాన్ని విస్తరించేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిర్ణయాలను మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాకు వివరించారు. ఎల్పీజీ సిలెండర్లపై ఆధారాన్ని తగ్గిస్తూ గుంటూరు, నెల్లూరు, కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లో పైప్డ్ గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ విధానం ద్వారా గ్యాస్ నిరంతర (మిగతా 2లో)

## రాజధాని తీర్మానం పెద్దడ్రామా



### అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించే యత్నం... సజ్జల రామక్రిష్ణారెడ్డి..

**తాడేపల్లి (తెలుగోడు),మార్చి 26 :**

అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం అన్నది చంద్రబాబు డ్రామా అని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఇది ప్రజలను మభ్యపెట్టడానికి చేస్తున్న ఎత్తుగడ అని సజ్జల ధ్వజమెత్తారు. అమరావతి కోసం అసెంబ్లీలో చంద్రబాబు తీర్మానం పెట్టడంపై సజ్జల అనేక ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి పేరిట అవినీతి నుంచి, రైతులకు పరిష్కారం కాని అంశాల నుంచి పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాల్సిన పరిస్థితి 2లో

## నేడు సీఎంలతో సమావేశం



### పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్

**న్యూ ఢిల్లీ (తెలుగోడు),మార్చి 26 :**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా (మిగతా 2లో)

## అబుదాబిపై ఇరాన్ మిస్సైల్ దాడి భారతీయుడి మృతి

### గాల్లోనే మిస్సైల్‌ను అడ్డుకున్న రక్షణ వ్యవస్థ..

### శకలాలు పడడంతో ఇద్దరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు..



**అబుదాబి (తెలుగోడు),మార్చి 26 :**

ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం ఇరవై ఏడో రోజుకు చేరుకుని మరింత ఉద్రిక్తంగా మారింది. అమెరికా యుద్ధంలో కొంత వెనకడుగు వేసినప్పటికీ ఇజ్రాయెల్ మాత్రం తన దాడులను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ మిస్సైళ్లు, డ్రోన్లతో ప్రతిదాడులు చేస్తూ ఇజ్రాయెల్‌తో పాటు అరబ్ దేశాలపై కూడా లక్ష్యంగా దాడులు జరుపుతోంది. గురువారం అబుదాబిపై ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్‌ను ప్రయోగించగా అక్కడి వైమానిక రక్షణ వ్యవస్థ అప్రమత్తంగా స్పందించి గాల్లోనే దానిని ధ్వంసం చేసింది. అయితే పేలిన మిస్సైల్ శకలాలు నేలపై పడడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరు భారతీయుడు కాగా మరొకరు పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ఘటనపై అబుదాబి మీడియా కార్యాలయం స్పందిస్తూ వైమానిక రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని తెలిపింది. శత్రు మిస్సైల్‌ను అడ్డుకున్నప్పటికీ శకలాలు (మిగతా 2లో)

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో పురుగుల భోజనం

### ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధింపు



**న్యూ ఢిల్లీ (తెలుగోడు),మార్చి 26 :**

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. అతడికి అందించిన భోజనంలో పురుగులు కనిపించాయి. దీంతో రైల్వే శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధించింది. పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రితేష్ కుమార్ అనే ప్రయాణికుడికి ఈ అనుభవం ఎదురైంది .రితేష్ కుమార్ మార్చి 15వ తేదీన పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో రితేష్‌కు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు కనిపించాయి. దీంతో షాకైన రితేష్ సంబంధిత అధికారులకు 2లో

## నకిలీ నాసిక్ బాబా కామ లీలలు



### రాసలీల వందల వీడియోలు స్వాధీనం..

### అత్యాచార ఆరోపణలతో కేసులు

**ముంబయ్ (తెలుగోడు),మార్చి 26 :**

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాకు చెందిన స్వయం ప్రకటిత బాబా వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. అత్యాచార కేసులో అరెస్టుతో ఈ దందా బయటపడగా, విచారణలో మరిన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ బాబాకు చెందిన ట్రస్ట్‌కు గతంలో ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల నిధులు మంజూరైన విషయం అధికారికంగా బయటపడింది. పర్యాటక అభివృద్ధి పేరుతో ఆలయ పరిసరాల్లో మౌలిక వసతుల కోసం ఈ నిధులు కేటాయించబడినట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పుడు రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా, సాధారణ వ్యక్తిగా జీవితం ప్రారంభించిన ఈ బాబా కొద్ది కాలంలోనే (మిగతా 2లో)

## అగ్నిప్రమాదాలపై సిట్



### అమరావతిలో వరుస అగ్ని ప్రమాదాలపై విచారణ..

**అమరావతి (తెలుగోడు),మార్చి 26 :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఇటీవల వరుస అగ్నిప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి.. అమరావతి ప్రాంతంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ నెల 11వ తేదీన ఎల్ అండ్ టీ సంస్థ వద్ద, అలాగే 23వ తేదీన మేఘా ఇంజినీరింగ్ సంస్థ పరిధిలో జరిగిన అగ్నిప్రమాదాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటనలపై నిజానిజాలు వెలికితీయడానికి ప్రభుత్వం వెంటనే స్పందించి సిట్‌ను నియమించింది. ఈ దర్యాప్తు బృందానికి గుంటూరు అడిషనల్ ఎస్పీ రవికుమార్ నేతృత్వం (మిగతా 2లో)

# బస్సు ప్రమాదం ఘోరం



(మొదటి పేజి (తరువాయి)

ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి. నరేంద్ర (25), నల్లగొండ్ల, టి. చందన (21), నల్లగొండ్ల, టి. చందు (6), నల్లగొండ్ల , కె. ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి. గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోనినిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. బస్సు ప్రమాదంపై మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

# ప్రధాని, సిఎం దిగ్భ్రాంతి

(మొదటి పేజి (తరువాయి)

**పిఎం మోదీ...**

ప్రార్థిస్తున్నానని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్ గ్రేషియా పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి అందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ మేరకు పీఎంఓ కార్యాలయం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం మండలం రాయవరం సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ప్రమాదంపై స్పందిస్తూ, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## సిఎం చంద్రబాబు.....

ప్రమాదం జరిగిన తీరుపై ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రికి జిల్లా ఎస్పీ, కలెక్టర్ వివరించారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నారని సీఎంకు తెలిపారు. ఈ దుర్ఘటనలో 13 మంది చనిపోయారని, 22 మంది గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు చెప్పారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సు జగిత్యాల నుంచి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంపై డ్రైవర్‌ను విచారించగా.. తన వాహనం స్టీరింగ్ స్టక్ అయ్యిందని చెప్పాడని.. దీనిపై నిజానిజాలను అధికారులు పరిశీలిస్తున్నారని సీఎంకు తెలియజేశారు. బస్సు పూర్తిగా ఆపోజిట్ రూట్‌లో వెళ్లడం వల్లనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో పరిస్థితి విషమంగా ఉన్నవారిని గుంటూరు ఆసుపత్రికి తరలించే ఆలోచనలో ఉన్నామని సీఎంకు జిల్లా కలెక్టర్ తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

# రాజధాని తీర్మానం పెద్ద డ్రామా

(మొదటి పేజి (తరువాయి)

ఎందుకు వచ్చింది? , ఎవరు అభ్యంతరం చెప్పారు, ఎవరు అడ్డంకులు చెప్పారన్న దానికి చంద్రబాబు వివరణ ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి, అంతా చేసేశానని చంద్రబాబు చెప్పుకోవాలని అనుకుంటున్నారు. అసెంబ్లీతో పాటు, మండలిని కూడా సమావేశపరచాలి కదా?, కానీ, అమరావతి లో చంద్రబాబు అవినీతి, వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నిస్తారనే మండలిని పిలవటం లేదా అని నిలదీసారు. శాశ్వత రాజధానిని నిర్మించి, ప్రజలకు వేగంగా అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన చంద్రబాబు ఎప్పుడూ చేయలేదు, అలాకాకుండా రాజధాని అంశాన్ని శాశ్వత కామధేనువుగా మార్చాడు, అమరావతిలో చంద్రబాబు అవినీతి యజ్ఞం చేస్తున్నారు' అని సజ్జల మండిపడ్డారు. ఈరాజధాని విషయంలో చంద్రబాబుకు ఆచరాణాత్మక ధోరణి ఇప్పటికీ లేదు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి వికేంద్రీకరణలో అమరావతికీ స్థానం ఉంది, అయితే ఇదంతా గతంలో జరిగిన పరిణామాలు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చారు, వచ్చాక కూడా ఏమీ చేయడం లేదు. చంద్రబాబు ఊహాజనిత రాజధాని, దానికయ్యే ఖర్చు ఎంత అవుతుంది అన్నదానిపై మేం ప్రశ్నలు వేశాం. అంతే తప్ప అమరావతి ప్రాంతానికి ఎప్పుడూ జగన్ వ్యతిరేకం కాదు. అందుకనే 2019లో అధికారంలోకి రాకముందే జగన్ ఇక్కడ ఇల్లు కట్టుకున్నారు. అమరావతి ప్రాంతానికి వైఎస్సార్‌సీపీ ఆ రోజూకాని, ఈ రోజుకాని ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. మేం అభ్యంతరం వ్యక్తం చేసేది అవినీతి మీద, దోపిడీ మీద. రైతుల సమస్యలను ఇప్పటికీ పరిష్కరించలేదు. పిల్లల పెళ్లిళ్లు కూడా రైతులు చేయలేకపోతున్నారు. చంద్రబాబు ప్రణాళిక ప్రకారం కనీస మౌలిక సదుపాయాల కోసం రూ.2 లక్షల కోట్లు కావాలి. 2014-19లో ఐదేళ్లలో ఖర్చు చేసింది రూ.5వేల కోట్లే. ఇప్పుడు కూడా చేసింది ఏమీ లేదు. ఇప్పుడు చదరపు అడుగుకు రూ.19వేల వరకూ పెంచారు. అమరావతిలో పాత బిల్డింగులు కాక, ఈ రెండేళ్లలో కొత్తగా కట్టారా?, మళ్లీ డిజైన్ల పేరిట రూ.400 కోట్లు ఖర్చుచేస్తున్నారు. 2018లో టెండర్లు ఖరారై, పనులు ప్రాంభమైన వాటికి కూడా మళ్లీ టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లతో గూడు పుఠానీ చేశారు. అందరికీ 4శాతం కంటే ఎక్కువ టెండర్లు ఖర్చు పెట్టారు. చంద్రబాబు తీరును చూసి, అమరావతి పేరిట చేసిన దోపిడీని చూసి రాష్ట్రం భయపడతోంది. చంద్రబాబు సృష్టించిన అవినీతి ఊబిలో రాష్ట్రం ఎక్కడకు పోతుందో తెలియడంలేదు. ప్రజల సొమ్ము, రాష్ట్ర వనరులను పీల్చి పిప్పిచేస్తున్నారు. ప్రజల భవిష్యత్తును, రాష్ట్ర భవిష్యత్తును చీకట్లో పెడుతున్నారు. అమరావతి గురించి ఆర్టీఐ కింద ప్రశ్నలు వేసినా సమాచారం ఇవ్వడంలేదు. అమరావతి పనుల్లో ఎక్కడా పారదర్శకత లేదు. ఈ విడతలో రూ.9వేలకోట్లు తెచ్చి, రూ.5వేల కోట్లు మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇచ్చారు. సుమారు 47వేల కోట్లకు శాంక్షన్లు ఇచ్చారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే.. అమరావతికి వ్యతిరేకం అని ముద్ర వేస్తున్నారు. ఈరాజధాని ప్రాంతానికి కనెక్టివిటీకోసం ఏమైనా చేశారా?, ఇప్పటికీ



కరకట్ట రోడ్డే కదా గతి. వచ్చినా వెస్టర్న్ బైపాస్ కూడా పూర్తి చేసింది వైఎస్సార్‌సీపీ హయాంలోనే కదా. పనులు ఏమీ చేయకపోయినా, ప్రజలను నిరంతరం భ్రమల్లో పెట్టాలన్నదే చంద్రబాబు ప్లాన్. మొదటి రోజు నుంచి ఇప్పటివరకూ అమరావతి విషయంలో వివరాలు ప్రభుత్వం బయటపెట్టగలదా?, మొదటి విడత భూములు తీసుకున్న రైతులకే ఏమీ చేయలేదు. కాని, రెండో విడత అంటూ మళ్లీ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అమరావతిలో జోరుగా జరుగుతున్న పనులు కేవలం చంద్రబాబు ఇల్లు మాత్రమే. అమరావతి పేరుమీ అప్పులు తెస్తున్నారు, మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తున్నారు, కమిషన్లు కొట్టేస్తున్నారు. రైతులకు ఇచ్చిన ప్లాట్లను ఎందుకు అభివృద్ధి చేయడం లేదు?, దీనికి ఎవరు అడ్డుపడ్డారు. చెరువుల్లో కూడా రైతులకు ప్లాట్లు ఇచ్చి వారిని నట్టేటా ముంచారు. ఎవరైనా దీన్ని ప్రశ్నిస్తే.. మళ్లీ వారిమీద ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబుకు ఇన్‌కంట్యాక్స్ నోటీసులు అమరావతి పనుల కమిషన్లకు సంబంధించే వచ్చాయి. రూ.2వేల కోట్ల అవినీతిపై ఆరోజు ఇన్‌కంట్యాక్స్ నోటీసులు వచ్చాయి. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు కమిషన్లు, లంచాలు వెళ్లాయని ఆ నోటీసుల్లో ఉంది. ఈ నోటీసులపై విచారణ ఆగిపోయింది. అమరావతిలో చంద్రబాబు అవినీతికి నిదర్శనానికి ఈ నోటీసులే. అమరావతి నిర్మాణాలు, అంచనాలు, అప్పులు చూస్తే ప్రజల గుండెలు అదిరిపోతున్నాయి. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అంటూనే అప్పులు చేస్తున్నారు. అమరావతిలో చంద్రబాబు. కట్టాలనుకుంటున్న భవనాల నిర్వహణ ఖర్చులు వింటేనే ప్రజలకు భయం వేస్తోంది. ఆచరాణాత్మకంగా, వాస్తవిక దృక్పథంతో చంద్రబాబు ఆలోచన లేదు. పనులు కన్నా, భ్రమలను కలిగిండచమే చంద్రబాబు ఉద్దేశం. చంద్రబాబు గతంలో చెప్పిన హైపర్ లూప్ ఏమయ్యింది?, అమరావతిలో ఒలింపిక్స్ ఏమయ్యాయి?' అని సజ్జల ప్రశ్నించారు. అమరావతి పేరుతో రైతుల సమస్యల్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం అన్నది చంద్రబాబు డ్రామా అని విమర్శించారు. అందుకే 2019 లో అధికారంలోకి రాకముందే మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి ఇక్కడ ఇల్లు కట్టుకున్నారని తెలియజేశారు. అమరావతి కోసం తీర్మానం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అని ప్రశ్నించారు. అసెంబ్లీతో పాటు, మండలిని కూడా సమావేశపరచాలని కదా? అని అన్నారు. రాజధాని పేరుతో చంద్రబాబు చేస్తున్న దోపిడీపైనే వైసిపి అభ్యంతరం చెప్పింది అని అన్నారు. ప్రజల్ని మభ్య పెట్టడానికి ప్రభుత్వం చేస్తున్న ఎత్తుగడ అని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.

# శాశ్వత రాజధానిగా అమరావతి

(మొదటి పేజి (తరువాయి)

చేయాలని నిర్ణయించింది. ఈ నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో జాబ్ క్యాలెండర్‌లో చేర్చాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అదే సమయంలో వడ్డెర సొసైటీలకు క్వారీ లీజుల్లో ప్రాధాన్యం కల్పిస్తూ, సీనరేజీపై రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిల పరిష్కారానికి సింగిల్ టైం సెటిల్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ చర్యతో ప్రజలకు ఉపశమనం కలిగించడంతో పాటు స్థానిక సంస్థలకు ఆదాయం పెరుగుతుందని భావిస్తోంది. అలాగే గ్యాస్ కనెక్షన్ల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తూ పట్టణాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ల సంఖ్యను గణనీయంగా పెంచాలని నిర్ణయించింది. వినియోగదారులకు రాయితీలు కొనసాగించనుంది. పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన పునరావాస చర్యల్లో భాగంగా భూముల పరిహారాన్ని పెంచాలని నిర్ణయించింది. ఎకరాకు పరిహారం మొత్తాన్ని పెంచుతూ బాధితులకు మరింత ఆర్థిక భరోసా కల్పించనుంది. ఇందుకోసం భారీగా నిధులు కేటాయించనున్నట్లు అంచనా వేస్తోంది. అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పనులకు కూడా అనుమతులు ఇస్తూ సాగునీటి రంగానికి ఊతం కల్పించింది.రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసింది. రోడ్ల నాణ్యత మెరుగుదల, వాహనాల అనుమతుల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.అమరావతి ప్రాంతంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపై ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేస్తూ విచారణకు ఆదేశించింది. కొన్ని ఘటనలు ఉద్దేశపూర్వకంగా జరిగి ఉండొచ్చనే అనుమానంతో లోతైన దర్యాప్తు చేపట్టనుంది. మొత్తంగా అమరావతిని శాశ్వత రాజధానిగా బలోపేతం చేయడమే కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేసింది.

# నేడు సిఎంలతో సమావేశం

(మొదటి పేజి (తరువాయి)

ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోడీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హార్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# మార్కాపురం ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

## ఈ ఘటన తీవ్రంగా కలచివేసిందన్న డిప్యూటీ సిఎం పవన్

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



**అమరావతి (తెలుగోడు), మార్చి 26 :**

మార్కాపురం సమీపంలో రాయవరం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు సజీవ దహనమైన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 13 మంది సజీవ దహనం అయ్యారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి కి లోనయ్యానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను జిల్లా అధికార యంత్రాంగం నుంచి వివరాలు తీసుకున్నానని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా పవన్ కల్యాణ్ తెలిపారు. టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం అత్యంత విషాదకరమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ దుర్ఘటనలో పలువురు సజీవదహనం కావడంపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణమే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉన్నతాధికారు లను మంత్రి అదేశించారు. ఈ ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందగానే.. హుటాహుటిన విజయవాడ నుంచి రాయవరానికి హోం మంత్రి అనిత బయలుదేరారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఈ సందర్భంగా మంత్రి అనిత భరోసా ఇచ్చారు. ఈ ప్రమాద ఘటన కారణంగా చేపట్టిన సహాయక చర్యలను మంత్రి అనిత ఎప్పటికప్పుడు అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. రాయవరం వద్ద ప్రమాద ఘటనలో మృతుల ఆత్మలకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 13 మంది ప్రయాణికులు సజీవ దహనం కావడంపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతులు, క్షతగాత్రుల వివరాలు సేకరించి.. వాటిని వారి బంధువులకు తెలియపర్చాలని మార్కాపురం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రయాణాల్లో నిబంధనలు పాటించాలని డ్రైవర్లకు సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటూ బస్సు డ్రైవర్లకు స్పష్టం చేశారు. బస్సుల్లో ప్రయాణికులను జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేర్చేలా చూడాలని వారిని మంత్రి సవిత కోరారు.సజీవ దహనం ఘటన తీవ్ర ఆవేదనకు గురి చేసిందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. ఘటనాస్థలిలో బాధితులకు సహాయ చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి సూచించారు. ఈ ప్రమాద ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను మంత్రి గొట్టిపాటికి అధికారులు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బస్సులో ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన తన సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని మంత్రి గొట్టిపాటి తెలిపారు.టిప్పర్‌ను ఢీకొట్టడంతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం అత్యంత విషాదకరమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు సజీవదహనం కావడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తక్షణమే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను అదేశించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను పూర్తిగా పరిశీలించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని.. అందుకోసం వారు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వైద్య నిపుణులను పంపించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. బాధితులకు భరోసా కల్పించాలని ఉన్నతాధికారులకు మంత్రి సత్య కుమార్ సూచించారు. రోడ్డు ప్రమాదంలో పలువురు మృతి చెందడం ఎంతో బాధ కలిగించిందని టీజీ భరత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మార్కాపురం జిల్లాలో బస్సు ప్రమాదంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికులు సజీవ దహనం కావడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. మరికొద్దిసేపటికి స్వస్థలాలకు చేరుకోవాల్సిన ప్రయాణీకులు సజీవ దహనం కావడం మాటలకు అందని విషాదమని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ తెలిపారు. క్షతగాత్రులకు సహకారం అందించాలని ప్రకాశం జిల్లా బీజేపీ నేతలను ఆదేశించామన్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారని.. వారి కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.

# విధ్వంసకర ఎత్తులేస్తున్న ఇరాన్

(మొదటి పేజి (తరువాయి)

వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలోని ఓ దేశం సహకారంతో ద్వీపాలను ఆక్రమించు కోవాలని మా శత్రువులు సన్నాహాలు చేస్తున్నారన్న నిఘా సమాచారం ఉంది. శత్రువుల కదలికలను మేం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. శత్రువు ఒక్క అడుగు ముందుకువేసినా.. పశ్చిమాసియాలోని ఆ దేశంలోని కీలక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఎడతెగని దాడులు చేస్తాం అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఎంబీ ఘలిబాఫ్ ఇప్పటికే హెచ్చరికలు చేశారు. అమెరికా సైనికులు, కమాండర్ల ఆచూకీ చెప్పండంటూ పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ (ఎసజీని) విజ్ఞప్తి చేసింది. అమెరికా స్థావరాలపై తాము దాడులు చేస్తుండటంతో అక్కడున్న యూఎస్ సైనికులు ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని ఇరాన్ వెల్లడించింది. పశ్చిమాసియా దేశాల ప్రజలు వారి ఆచూకీని వెల్లడించాలని కోరుతున్నాం. అలాగే మీ భద్రత కోసం వారిని బహిష్కరించండని అడిగింది. తమ దాడుల్లో దెబ్బతిన్న అమెరికా స్థావరాలు నిర్జన ప్రాంతాలుగా మారాయని పేర్కొంది. 13 సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని వెల్లడించింది. భూతల దాడుల వార్తల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాన్ని ఇరాన్ హెచ్చరించింది. నెతన్యాహు, ట్రంప్ చేస్తోన్న మోసానికి మీ పిల్లలను బలిచేయకండంటూ హెచ్చరించింది.

# తెరుచుకున్న హార్ముజ్

(మొదటి పేజి (తరువాయి)

వెలుపల పౌరులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు, అభద్రతతో జీవిస్తున్నారు. సంఘర్షణ పరిణామాలను తగ్గించడానికి పోరాటాన్ని ముగించడమే సరైన నిర్ణయం' అని గుటెర్రెస్ ఒక ప్రకటనలో రాశారు.

# నగరాల్లో.. పైప్ గ్యాస్

(మొదటి పేజి (తరువాయి)

సరఫరా అందుతుందని ప్రభుత్వం భావిస్తోంది.అపార్ట్మెంట్లు, పరిశ్రమల యూనిట్లు ఈ పద్ధతిని అవలంబిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. ప్రధాన దేవాలయాల్లో కూడా పైప్డ్ గ్యాస్ సదుపాయం కల్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌కు ఈ రంగంలో మెరుగైన అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.జీఎస్టీ పెంపు కారణంగా ఇప్పటివరకు వినియోగదారులు పెద్దగా ముందుకు రాలేదని పేర్కొన్న మంత్రి, దీపం సబ్సిడీ పథకాన్ని పైప్డ్ గ్యాస్ వినియోగదారులకు కూడా వర్తింపజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగు నెలలకు ఒకసారి ఉచిత సిలెండర్ ఇస్తుండగా, పైప్డ్ గ్యాస్ వినియోగదారులకు రెండు నెలలకు ఒకసారి సబ్సిడీ భాగస్వామ్యం అందిస్తామని చెప్పారు. రూ.2400 డీబీటీ మొత్తాన్ని పైప్డ్ గ్యాస్‌కు మారేవారికి బదిలీ చేయనున్నట్లు వివరించారు.పైప్‌లైన్ ఏర్పాటు కోసం 24 గంటల్లోనే అనుమతులు ఇవ్వడం లేదా ఆటోమేటిక్‌గా అనుమతులు లభించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. పది లక్షల కొత్త కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, నెలరోజుల్లోనే లక్ష మందికి కనెక్షన్లు అందించేలా చర్యలు చేపడుతోంది.సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ఖండిస్తూ రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతిరోజూ లక్షలాది మందికి గ్యాస్ సిలెండర్లు సరఫరా జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ కొనసాగుతోందని చెప్పారు.దేశంలోనే మొదటిసారిగా ఈ విధానాన్ని ప్రభుత్వ పాలసీగా అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, నిరంతర గ్యాస్ సరఫరా అందించడమే లక్ష్యమని వెల్లడించారు.

# వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో పురుగుల భోజనం

(మొదటి పేజి (తరువాయి)

ఫిర్యాదు చేశారు. రైల్వే సిబ్బంది కూడా ఆ భోజనాన్ని పరిశీలించారు. ఈ మొత్తం తతంగాన్ని రితేష్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. వీడియోపై రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షలు జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది. అలాగే ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానా విధించడంతో పాటు అతడి కాంట్రాక్టును కూడా రద్దు చేసింది. రైల్వే ప్రయాణికుల భద్రతకే తమ మొదటి ప్రాధాన్యం అని తేల్చి చెప్పింది.

# అబుదాబిపై ఇరాన్ దాడి భారతీయుడి మృతి

(మొదటి పేజి (తరువాయి)

పడటంతోనే ప్రాణనష్టం సంభవించిందని వెల్లడించింది.మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఇప్పటివరకు మరణించిన భారతీయుల సంఖ్య ఏడుకు చేరినట్లు సమాచారం. యూఏఈ రక్షణ వ్యవస్థ ఇప్పటివరకు వందలాది బాలిస్టిక్ మిస్సైళ్లు, అనేక క్రూయిజ్ మిస్సైళ్లు, వేల సంఖ్యలో డ్రోన్లను అడ్డుకుని ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.ఇక యుద్ధ పరిణామాల మధ్య అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందంపై మరింత ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారే అవకాశముందని స్పష్టం చేశారు. ఒకవైపు చర్చలు కొనసాగిస్తున్నట్లు చెబుతూ బయటకు భిన్నంగా వ్యవహరించడం సరైంది కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యం కాకముందే బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# అగ్నిప్రమాదాలపై సిట్

(మొదటి పేజి (తరువాయి)

వహించనున్నారు. బృందంలో నలుగురు సీఐలు, నలుగురు ఎస్సైలు ఉండగా, తుళ్లూరు సీఐ, డీఎస్పీ కూడా సభ్యులుగా ఉన్నారు. అదనంగా సాంకేతిక నిపుణుల సహకారంతో విచారణను మరింత లోతుగా కొనసాగించనున్నారు. అగ్నిప్రమాదాల వెనుక ఉన్న కారణాలు, ఏవైనా నిర్లక్ష్యాలు లేదా ఇతర అంశాలపై సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనలపై సిట్ విచారణ ద్వారా పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# నకిలీ నాసిక్‌బాబా కామలీలలు

(మొదటి పేజి (తరువాయి)

భారీ ఆస్తులు కూడబెట్టినట్లు దర్యాప్తులో తేలింది. పోలీసుల తనిఖీల్లో అతనికి చెందిన డిజిటల్ పరికరాల నుంచి అనేక అశ్లీల వీడియోలు స్వాధీనం కావడం కేసుకు మరింత తీవ్రత తెచ్చింది. మూఢనమ్మకాల పేరుతో మహిళలను మోసం చేసి లైంగిక దాడులకు పాల్పడి, ఆ దృశ్యాలను బ్లాక్‌మెయిల్ కోసం ఉపయోగించినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ వీడియోలను సైబర్ నిపుణులు పరిశీలిస్తున్నారు.ఒక మహిళ ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. బాధితుల్లో మరికొందరు ఉన్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు రాజకీయ సంబంధాలు కూడా ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతుండగా, ఆ కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది.



అరణ్యకాండను వివరిస్తున్న డాక్టర్ ప్రపుల్ల

## విధి రాతను ఎవరూ తప్పించలేరు

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 26 :**
మహాత్ముల నుండి సాధారణ మానవుని వరకు విధిరాతను ఎవరు తప్పించలేరని విశ్రాంత సంస్కృత ఉపన్యాసకురాలు డాక్టర్ ప్రపుల్ల పేర్కొన్నారు. నగరంలోని శృంగేరి శంకర మఠంలో రామాయణ అంతర్గత అరణ్యకాండ ప్రవచనం ముగింపు కార్యక్రమంలో భాగంగా రామాయణంలోని ముఖ్యమైన ఘట్టాలను వివరించారు. దశరథ మహారాజుకు ఋషి శాపం వల్ల కుమారుల వియోగం ఎలా జరిగిందో వివరించారు. తల్లిదండ్రుల యొక్క ఆజ్ఞ మేరకు 14 సంవత్సరాల పాటు రాముడు అరణ్యవాసం చేయడం, అరణ్యంలో భార్యాభర్తల అనుబంధాన్ని,భరతుడు శ్రీరాముని యొక్క పాదుకుల పట్టాభిషేకం, అరణ్యంలో సీతాదేవి శ్రీరామచంద్రుని వేషధారణ చక్కగా వివరించారు. రాజభోగాలు అనుభవించవలసిన వారు విది రాతతో అరణ్యంలో ఆకులు అలములు తింటూ, కటిక నేలపై పవలించడం, తదితర సన్నివేశాలను వివరించారు.



అవార్డు గ్రహీతలకు సన్మానం చేసిన దృశ్యం

## ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 26 :**
అంతర్జాతీయ రంగస్థలం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉగాది పురస్కారాలు అందుకున్న జిల్లా కళాకారులకు లలిత కళాపరిషత్ కార్యవర్గం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ పురస్కారాలు అందుకున్న కళాకారులను సన్మానించడం పరిషత్ యొక్క అదృష్టం అన్నారు. జిల్లా కళాకారులే కాకుండా గ్రామీణ ప్రాంతాలలోని కళాకారులను మరింత ప్రాచుర్యంలోనికి తేవడానికి పరిషత్తు నందు వారికి నాటక ప్రదర్శన ఉచితంగా చేసుకునేలా ఏర్పాటు చేశామన్నారు. అంటే కాకుండా వారికి 25 వేల రూపాయలు నగదు ను కూడా అందజేశామన్నారు. గ్రామీణ కళాకారులు సాంఘిక పౌరాణిక నాటకాలను పూర్తిగా ప్రదర్శించాలని వారికి పరిషత్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది అన్నారు. అనంతరం సత్య హరిచంద్ర నాటకం హృదయాలకు హత్తుకునేలా పాత్రలో పోషించారు. అవార్డు గ్రహీతలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సంఘాల నారాయణస్వామి, అస్లాం బాష లోకేష్ పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

## యుగాది తెలుగు కాలెండర్ ఆవిష్కరణ

### సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి..

**పెద్దపప్పూరు (తెలుగోడు), మార్చి 26 :**
త్రిమత ఏకైక గురువు , ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్రవర్తి, శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల వారి దివ్య ఆశీసులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక తాడిపత్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్ద పప్పూరు పట్టణంలో త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్ (త్రైతశకం-48)ను శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు, అనంతరం త్రైతశకం తెలుగు క్యాలెండర్‌లను పోలీసు సిబ్బంది, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థం అయ్యే విధంగా రూపొందించారన్నారు. దేవాలయం సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారంతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత సారాంశం ఇందులో పొందుపరిచారన్నారు. తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరచి తయారు చేసిన ఇటువంటి గొప్ప కాలసూచికను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక తాడిపత్రి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు బాలయ్య, హరినాథ్, సాంబశివుడు, నరసింహ, బాల రంగయ్య, చంద్రశేఖర్ సూర్యనారాయణ, నాగభూషణం , ప్రసాద్ పాల్గొన్నారు.

## నాగేపల్లిలో నేడు శ్రీ సీతారాముల కళ్యాణం

**కనేకల్ (తెలుగోడు), మార్చి 26 :**
కనేకల్ మండలం పరిధిలోని నాగేపల్లి గ్రామంలో ఎంతో వైభవంగా ప్రతి యేటా జరగబోయే శ్రీ సీతారామ కళ్యాణమునకు భక్తాదులు అందరూ ఆహ్వానితులేనని కనేకల్లు నాగేపల్లి గ్రామస్తులు తెలిపారు.శ్రీరామ నవమి సందర్భంగా కనేకల్ తారక రామనగర్ ప్రాంతంలో మరియు నాగేపల్లి, గ్రామంలో వ్యాసరాజ మహర్షి చేత ప్రతిష్టించిన శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయము నందు ప్రతీ సంవత్సరంలో భాగంగా జరగబోయే శ్రీరామనవమి రోజు శ్రీ సీతారామ కళ్యాణము మరియు సాయంత్రం ఐదు గంటల సమయంలో స్వామివారి రథోత్సవం మరియు రాత్రి భారత నాట్య సాంస్కృతిక కారక్రమములు నిర్వహిస్తున్నారు, మధ్యాహ్నం భక్తాదుల చేత భజన వాలం బ్రదర్స్ వెంకటేశులు నిర్వహిస్తున్నారు. రాత్రి 7గం నుండి రాత్రి 9గం వరకు భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే మధ్యాహ్నము శ్రీ సీతారాముల కళ్యాణాం అనంతరం అన్నదాన సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది, నాగేపల్లి చుట్టుపక్కల గ్రామ ప్రజలు, భక్తదులు నాగేపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో జరగబోయే కళ్యాణమనకు భక్తిశ్రద్ధలతో అందరూ పాల్గొని దర్శించి స్వామి వారి కృపాకటాక్షలకు పాత్రులుకాగలరు అని కోరుతున్నామని గ్రామ పెద్దలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ నాగేపల్లి అభయ ఆంజనేయస్వామి దేవస్థానం అర్చకులు లక్ష్మీ నారాయణస్వామి, వెంకటేశు లు, మహేష్, రామాంజనేయులు,హరి గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వ్యాసరాయ ప్రతిష్టాప నాగేపల్లి ఆంజనేయస్వామి మూలవిరాట్

## పర్యాటకపరంగా తాడిపత్రికి మహర్దశ

### ఆలయ పర్యాటక వలయంతో తాడిపత్రికి నూతన అభివృద్ధి దిశ.. మాజీ మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ..

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 26 :**
అనంతపురం జిల్లాలో చారిత్రాత్మక, శిల్పకళా వైభవానికి నిలయమైన తాడిపత్రి పట్టణం త్వరలో పర్యాటకపరంగా మహర్దశను అందుకోబోతుందని మాజీ మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆలయ పర్యాటక వలయ అభివృద్ధి ద్వారా పట్టణాన్ని రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. శ్రీ చింతల వెంకటరమణ స్వామి సన్నిధిలో గురువారం పర్యాటక వలయానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.250 కోట్ల వ్యయంతో సమగ్ర పర్యాటక అభివృద్ధి ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. ఈ ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి, కేంద్ర సహకారంతో త్వరలో అమలు దిశగా తీసుకెళ్తామని చెప్పారు.
తాడిపత్రిలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ చింతల వెంకటరమణ స్వామి దేవాలయాలను ప్రధాన ఆకర్షణలుగా తీసుకుని ప్రత్యేక పర్యాటక వలయం రూపుదిద్దుకుంటుందని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా భక్తులు, పర్యాటకులకు ఆధునిక అనుభవాన్ని అందించే విధంగా సౌండ్ అండ్ లైట్ షోలు, లేజర్ ప్రదర్శనలు, పురావస్తు ప్రదర్శనశాల, ధార్మిక సదస్సుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా ఆలూరు కోన శ్రీ రంగనాథ స్వామి ఆలయం అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఈ వలయంలో భాగంగా చేర్చడం ద్వారా పరిసర ప్రాంతాల పర్యాటక ప్రాధాన్యతను పెంచేలా ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. పట్టణంలో రహదారులు, పార్కింగ్, పారిశుద్ధ్యం, లైటింగ్, భద్రత వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి తాడిపత్రిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తామని తెలిపారు.
ఈ సందర్భంగా పర్యాటక నిపుణుడు, చరిత్రకారుడు మైనాస్వామి మాట్లాడుతూ ఈ పర్యాటక వలయం అమలు అయితే తాడిపత్రి పట్టణం రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. హోటల్, ట్రావెల్, గైడ్ సేవలు, హస్తకళల విక్రయం వంటి రంగాల్లో యువతకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.
పర్యాటక వలయం విజయవంతమైతే తాడిపత్రి రాష్ట్ర పర్యాటక పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించడమే కాకుండా, ఆధ్యాత్మిక పర్యాటకానికి కేంద్రంగా అవతరించే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు చంద్రమోహన్, చరిత్ర పరిశోధకుడు పెనుకొండ శ్రీధర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



చరిత్రకారుడు మైనాస్వామిని సత్కరిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి





పర్యాటక వలయ అభివృద్ధి ప్రాథమిక నివేదికను అందజేస్తున్న దృశ్యం. శ్రీ చింతల వెంకట రమణ స్వామి ఆలయాన్ని సందర్శిస్తున్న దృశ్యం

### ఆర్‌డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ..

## క్రీడాకారుల సంబరాలు

### కేక్ కట్ చేసిన క్రీడాకారులు.. ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి..

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 26 :**
సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రసిద్ధి చెందిన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతులు లభించడంతో తాడిపత్రి నియోజకవర్గంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డితో కలిసి గురువారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా ఆర్‌డీటీ సంస్థ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ మోంచో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌డీటీ సంస్థ అనేక సంవత్సరాలుగా అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తోందన్నారు. ఆర్‌డీటీ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు, విద్య, ఆరోగ్య రంగాలకు ఎంతో సేవలు అందుతున్నాయని తెలిపారు. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, క్రీడలు వంటి విభాగాల్లో ఆర్‌డీటీ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.
క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ యువతలో ప్రతిభను వెలికితీసి దేశానికి మంచి క్రీడాకారులను అందించే దిశగా ఆర్‌డీటీ చేస్తున్న కృషి ఎంతో గొప్పదని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన క్రీడాకారులకు శిక్షణ, సౌకర్యాలు, ప్రోత్సాహం అందించడం ద్వారా జాతీయ స్థాయికి ఎదగడానికి ఆర్‌డీటీ సంస్థ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతులు రావడం వల్ల ఆర్‌డీటీ సేవలు మరింత విస్తృతంగా కొనసాగుతాయని, కొత్త ప్రాజెక్టులు అమలులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం క్రీడాకారులు ఆర్‌డీటీ సంస్థ తమకు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్రీడాకారులు, కోచ్‌లు, ఆర్‌డీటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## కిడ్నాప్‌కు గురైన బాలుడి దారుణ హత్య

### సొంత బావే హంతకుడు.. నమ్మించి బామ్మర్దిని హత్య చేశాడు. కుటుంబకుల ఆవేదన.. పోలీసుల అదుపులో నిందితుడు..

**యాడికి (తెలుగోడు), మార్చి 26 :**
యాడికి మండల పరిధిలోని కోన ఉప్పలపాడు గ్రామంలో బుధవారం కిడ్నాప్ అయిన బాలుడు హేమచంద్ర (7) దారుణహత్యకు గురయ్యాడు బావ అని నమ్మించి బామ్మర్దిని హత్య చేశాడు అంటూ కుటుంబీకులు కన్నీరు మున్నీరు అయ్యారు. హేమచంద్రను చంపిన కిరాతకుడిని చంపేంతవరకు శవాన్ని ఎత్తం అంటూ కుటుంబీకులు భీష్మించారు. పోలీసులు సర్దిచెప్పడంతో శాంతించారు. వివరాలు ఇలా ఉన్నాయి.
కోనుప్పలపాడు గ్రామానికి చెందిన బోయ గోవిందు, లక్ష్మీకాంతమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు హేమచంద్ర (7). పెద్ద కూతురును యాడికి మండలంలోని నిట్టూరు గ్రామానికి చెందిన వెంకట నారాయణ కుమారుడు సర్వేష్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. యాడికిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న హేమచంద్ర బుధవారం పాఠశాలకు వెళ్లి వచ్చిన తరువాత బావ సర్వేష్ కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేశాడు. బుధవారం సాయంకాలం బామ్మర్ది హేమచంద్రను కిడ్నాప్ చేశారంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వచ్చాడు. అయితే అప్పటికే పోలీసులు సీసీ కెమెరాలు గమనించి అనుమానంతో సర్వేష్‌ను విచారించేలోపు అక్కడి నుండి జారుకున్నాడు.
బాలుడు ఆచూకీ కోసం ఏ ఎస్ పి రోహిత్ కుమార్ చౌదరి యాడికి శ్రీనివాసులు ప్రత్యేక పోలీస్ బృందం క్లూస్ టీం డాగ్‌స్క్వాడ్‌తో యాడికి మండలంతో పాటు నంద్యాల జిల్లా మండల సరిహద్దులో ఉన్న గ్రామాలలో తనిఖీలు చేపట్టారు. పోలీసులు అప్రమత్తం కావడంతో గురువారం సర్వేష్‌ను అదుసులోకి తీసుకున్న పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేయగా తానే హత్య చేశానని అంగీకరించాడు. కుందన కోట చింతలాయపల్లి కొండలలో బండరాళ్లతో కొట్టి హత్య చేసిన ప్రదేశాన్ని పోలీసులకు చూపించాడు. తాడిపత్రి ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి. సీఐ శ్రీనివాసులు పెద్దవడుగూరు సిఐ రామసుబ్బయ్య. తాడిపత్రి సిఐలు ఎస్సైలు ఆంజనేయులు డాగ్ స్కీమ్ క్లూస్ టీం ప్రత్యేక పోలీస్ బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.
హేమచంద్ర ఇక లేడు అన్న సమాచారం తెలుసుకున్న తల్లితండ్రులు అక్కలు గ్రామస్తులు బంధువులు భారీ సంఖ్యలో సంఘటన స్థలానికి చేరుకుని భోరున విలపించారు. బాలుడుని చంపి కొండల్లో గోయలో బండరాళ్లతో కప్పి పెట్టిన ఘటనను చూసి కుటుంబీకులు బంధువులు గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. పిల్లాడన్న కనికరం లేకుండా బామ్మర్దినే నమ్మించి అతి కిరాతకంగా బండరాళ్లతో హత్య చేయడం దారుణమని, ఇలాంటి వారిని హత్య చేసినా తప్పు కాదని ఆవేదన వ్యక్తం చేశారు.





కుందన కోట గ్రామ సమీపంలోని కొండల్లో బాలుడు హేమచంద్రను గుండు రాళ్ల కింద చంపి బడిన దృశ్యం



హేమచంద్రను దారుణంగా హత్య చేసిన దృశ్యం









మృతిచెందిన హేమచంద్ర కుటుంబం తల్లి తండ్రి అక్కలు. సీఐ శ్రీనివాసులతో మాట్లాడుతున్న బాలుడి కుటుంబీకులు. మృతదేహం వద్ద గుమిగూడిన గ్రామస్తులు.



అలంకరణలో శ్రీ అనంతేశ్వరి అమ్మవారు

## మహాగౌరీ దేవి అలంకారంలో శ్రీ అనంతేశ్వరి దర్శనం

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 26 :**
శ్రీ శివ బాలయోగి మహరాజ్ ఆశ్రమంలో జరుగుతున్న వసంత నవరాత్రుల్లో భాగంగా మహా గౌరీ దేవి అలంకార రూపంలో శ్రీ అనంతేశ్వరీ దర్శనమిచ్చారు. వసంత నవరాత్రులలో 8వ రోజు (దుర్గాష్టమి) అత్యంత పవిత్రమైనది. మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీ అనంతేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, గురువారం మహా గౌరీ దేవి అలంకార రూపంలో అమ్మవారికి ప్రత్యేక పూజా నిర్వహించారు. దేవి ఖడ్గమాల స్తోత్రం, మణిద్వీప వర్ణన, సౌందర్యలహరి పారాయణం హనుమాన్ చాలీసా, గోవింద నామాలు,శ్రీరామ నామాలు, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు.



మాదిగల చైతన్య సదస్సు పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## 30న మాదిగల చైతన్య సదస్సు జయప్రదం చేయండి

### పోస్టర్ విడుదల.. ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మహేష్..

**యాడికి (తెలుగోడు), మార్చి 26 :**
ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజన్న ఆదేశాల మేరకు ఈనెల 30న జరుగనున్న మాదిగల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మహేష్ కోరారు. ఈ మేరకు గురువారం రాయలచెరువు అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా బండి మహేష్ మాట్లాడుతూ మాదిగలంతా ఒక్కటై మహా చైతన్య సదస్సును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేకల మహేంద్ర, మేకల మస్తాన్ , రామయ్య, శింగలమల సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజకుమార్

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి 10 వేలు జరిమానా

**రొళ్ల (తెలుగోడు), మార్చి 26 :**
అగలి మండలం దొక్కలపల్లి గ్రామానికి చెందిన సునీల్ కుమార్ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో మడకశిర మేజిస్ట్రేట్ 10 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ రాజకుమార్ తెలిపారు. మడకశిర రూరల్ సిఐ రాజకుమార్ వాహనాల తనిఖీ చేస్తున్నా సమయం లో సునీల్ కుమార్ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతుండగా బ్రీత్ అనలైజర్ ద్వారా గుర్తించి మడకశిర మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా రూ. 10000 జరిమానా విధించిన్నట్లు సీఐ రాజకుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గౌతమి, ఎఎస్ఐ హిదయాతుల్లా, హెడ్ కానిస్టేబుల్ రామలింగప్ప, కానిస్టేబుల్ అనిల్ పాల్గొన్నారు.



ముద్దాయి సునీల్ కుమార్



శ్రీరాముని చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించిన దృశ్యం

## శ్రీలక్ష్మీ విద్యానికేతన్‌లో శ్రీరామ నవమి వేడుకలు

**రొళ్ల (తెలుగోడు), మార్చి 26 :**
మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో గురువారం ముందస్తు శ్రీరామ నవమి వేడుకలను పాఠశాల యాజమాన్యం ఘనంగా జరుపుకున్నారు. పట్టాభిరాముడి చిత్రపటానికి విశేషపూజలు నిర్వహించారు. విద్యార్థులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ రాముని చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు.



శ్రీరామునికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు

## ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

*ప్రారంభించిన ఎస్ ఐ గౌతమి..*

**రొళ్ల (తెలుగోడు), మార్చి 26 :**
మండల కేంద్రానికి వివిధ గ్రామాలనుండి పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ ఐ గౌతమి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.మండల కేంద్రం లోని బస్టాండ్ దగ్గర రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుద్ధ నీటి చలివెంద్రాన్ని ఏర్పాటుచేసారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు భోదించడమే కాకుండా, ప్రజా సేవలో కూడా రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ముందుఉండడం పట్ల ఎస్ ఐ గౌతమి అభినందించారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు యంజారప్ప, రెడ్డప్ప, మహాదేవప్ప, హరికుమార్, చంద్రబాబు, చంద్రమౌళి, సంతోష్, మురళి, కోదండపాణి, మురళి, మాజీ పాఠశాల విద్యాకమిటి మాజీ చైర్మన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ గౌతమి ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన చలివేంద్రం

# వీరాపురంలో బీటీ రోడ్డు పనులు పునఃప్రారంభం

**అమరాపురం (తెలుగోడు), మార్చి 26 :**
మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో బిటి రోడ్డును గురువారం మండల కూటమి సభ్యులు పునః ప్రారంభించారు. వీరాపురం – అమరాపురం బిటి రోడ్డు పూర్తి అధ్వానంగా, గుంతల మయంగా ఉండేదని ప్రజలు వైఎస్ఆర్సిపి ప్రభుత్వం కాలంలో ఎన్నోసార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందన్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. బీటీ



బిటి రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న కూటమి కుటుంబ సభ్యులు



బీటీ రోడ్డు నిర్మాణానికి పూజలు చేస్తున్న నాయకులు

రోడ్డు వేయడానికి జిల్లా ఉపాధ్యక్షులు రత్నమ్మ నరసింహమూర్తి,నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్ సింగల్ విండో అధ్యక్షులు ఎన్ గణేష్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ చెన్నప్ప డైరెక్టర్ దాదా పీర్, డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, టిఎన్టియుసి కార్యదర్శి మంజన్న, డీలర్ రమేష్, రఘు యాదవ్, వీరాపురం రఘు, మాలప్ప, సిద్దేశ్వర, శివన్న కూటమి కుటుంబ సభ్యులు పూజలు చేసి ప్రారంభించారు. . ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ధన్యవాదాలు తెలిపారు.

# నరసంబూదిలో తాగునీటి సమస్య పరిష్కారం

### ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ ఆదేశాలతో పంపుసెట్లు అమరిక.. మండల తెలుగు యువత అధ్యక్షుడు గోవిందరాజ్..

**అగళి (తెలుగోడు), మార్చి 26 :**
ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాలతో మండల పరిధిలోని నరసంబూది గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం అయిందని మండల తెలుగు యువత అధ్యక్షుడు గోవిందరాజు తెలిపారు. అగళి మండలం నరసంబూది గ్రామంలో



బోరుబావికి కొత్త మోటార్ పంప్‌సెట్ బిగించి నీళ్లు తోడుతున్న దృశ్యం



బోరుబావిలోకి మోటారు పంపు సెట్లను దింపిస్తున్న నాయకులు

తాగునీటి సమస్య తీవ్రం కావడంతో విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే స్పందించి నియోజకవర్గంలో ఏ గ్రామంలో నీటి సమస్య ఉండకూడదని సమస్య తెలుసుకొని గురువారం కొత్త మోటర్ పంప్‌లు పంపించారన్నారు. దీంతో స్థానిక నాయకులు అందరూ కలసి బోరు బావిలో పైపులు మోటర్ పంపు సెట్లను దింపి నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి సహకారం అందించిన ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గోవిందరాజు, బలిజ సంఘం మండల అధ్యక్షుడు, ప్రముఖ పూలవ్యాపారి నారాయణప్ప, మాజీ మండల ప్రధాన కార్యదర్శి జయప్ప, యూనిట్ ఇంచార్జ్ మంజునాథ్, పంచాయతీ కార్యదర్శి పరమేష్ ,గ్రామప్రజలు పాల్గొన్నారు.

# తప్పిపోయిన యువతిని ఒక్కరోజులో గుర్తించిన నల్లమాడ పోలీసులు

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 26 :**
సత్యసాయి జిల్లా నల్లమాడ మండలంలో తప్పిపోయిన యువతిని పోలీసులు 24 గంటల్లోనే గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల వేగవంతమైన చర్యలు, సమన్వయం ఈ ఘటనలో స్పష్టంగా కనిపించాయి. కొండ్రువారిపల్లి గ్రామానికి చెందిన నరసాపు నాగేష్ కుమార్తె మీనాక్షి (19) ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం సంతకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బంధువులు, గ్రామస్తులతో కలిసి వెతికినా ఎలాంటి సమాచారం దొరకకపోవడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. దీంతో 25వ తేదీన నల్లమాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందించగా, మహిళ కనిపించకుండా పోయిన కేసు నమోదు చేశారు. కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న జిల్లా పోలీసు అధికారి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, ఉపాధికారి విజయ్ కుమార్, వలయాధికారి శ్రీనివాస్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు.
పోలీసులు సమీప గ్రామాలు, బస్ స్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు, రహదారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో విచారణ చేపట్టారు. అవసరమైన చోట్ల సాంకేతిక ఆధారాలు సేకరించి, యువతి వెళ్లిన మార్గాలను గుర్తిస్తూ దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రతి చిన్న సమాచారాన్ని విశ్లేషిస్తూ ముందుకు సాగిన పోలీసులు కేవలం 24 గంటల వ్యవధిలోనే యువతి ఆచూకీ గుర్తించారు.
తదనంతరం యువతిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.



తప్పిపోయిన యువతిని గుర్తించిన పోలీసులు

తమ కుమార్తెను ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరిగి చేర్చిన పోలీసులపై కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు కూడా పోలీసుల చర్యలను ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు కేసు పరిష్కారంలో కీలకంగా పనిచేసిన సిబ్బందిని అభినందించారు. ప్రజలు ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల సేవలో ఉంటారని వారు తెలిపారు.

# ఎంపీడీవో కార్యాలయం ఆకస్మిక తనిఖీ

### రికార్డుల పరిశీలన.. సీ.ఈ.వో. శివశంకర్.. డిప్యూటీ సీ.ఈ.ఓ. వెంకటసుబ్బయ్య..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 26 :**
అమరాపురం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సి.ఓ. శివశంకర్, డిప్యూటీ సి. ఓ. వెంకటసుబ్బయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. 32 గ్రామాలలో గత సంవత్సరము నుంచి శ్రీరామ రెడ్డి నీటి సరఫరా కావడం లేదని ఎంపీడీవో రామారావు, ఇ. ఓ .ఆర్. డి. ప్రసాద్‌ను ప్రశ్నించారు. ప్రతి గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. వేసవి కాలం కావడంతో అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా ప్రతి పంచాయతీలో చెత్త సేకరణ కోసం బండ్లను అందజేశామని సక్రమంగా వాడుకోవాలని వారు సూచించారు. అలాగే సుప్రసిద్ధ ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రం హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వీరి వెంట ఎంపీడీవో రామారావు, ఈ. ఓ. ఆర్ డి. ప్రసాద్ పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.



గ్రామాలలో తాగునీటి సమస్య గురించి తెలుసుకుంటున్న సి ఓ శివశంకర్





రికార్డులను పరిశీలిస్తున్న సిఈఓ శివ శంకర్, మండల అధికారులతో చర్చిస్తున్న సిఈఓ శివ శంకర్, డిప్యూటీ సిఈఓ వెంకటసుబ్బయ్య



తిప్పేస్వామిని పరామర్శిస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్

## టిడిపి సీనియర్ నేత తిప్పేస్వామికి పరామర్శ

*సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్..*

**అమరాపురం (తెలుగోడు), మార్చి 26 :**
మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తిప్పేస్వామిని గురువారం సింగిల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్ , తెలుగుదేశం శ్రేణులు, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు మారుతి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ చెన్నప్ప, డైరెక్టర్ దాదా పీర్, డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, టిఎన్టియుసి కార్యదర్శి మంజన్న, డీలర్ రమేష్ ,రఘు యాదవ్, వీరాపురం రఘు, మాలప్ప, సిద్దేశ్వర,, శివన్న, కూటమి కుటుంబ సభ్యులు కలిసి పరామర్శించారు.



విరాళాలు అందజేసిన వారికి సత్కరిస్తున్న దృశ్యం

## పాఠశాలలో సభా వేదిక నిర్మాణానికి విరాళం

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 26 :**
నల్లమాడ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో చేపట్టిన సభా వేదిక నిర్మాణానికి గ్రామస్థులు, ప్రముఖులు నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో నల్లమాడకు చెందిన పొరకల రమణ రూ.10,000, ప్రస్తుతం నల్లమాడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న అంజనప్ప రూ.15,000 విరాళంగా అందజేశారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు ఎప్పటికప్పుడు ముందుండే పూర్వ విద్యార్థుల సేవలను అభినందించిన వారు, భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విరాళాలు అందజేసిన వారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రషీద్ ఖాన్, టీడీ రఘునాథరెడ్డి, గౌస్ బాషా, రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మన్న, ఏఎన్ చంద్రశేఖర్ రెడ్డి, మాధవరెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సభా వేదిక నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేదిక పూర్తయిన తరువాత విద్యార్థుల విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



నిందితుడిని అరెస్టు చేసి వివరాలు తెలియజేస్తున్న సిఐ శ్రీనివాసులు

## పలుకేసుల్లో నిందితుడి అరెస్ట్

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 26 :**
శ్రీ సత్య సాయి జిల్లా నల్లమాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితుడైన మల్లెల వినోద్ కుమార్ అలియాస్ కర్ల (26)ను పోలీసులు అరెస్ట్ చేశారు. చౌటుకుంటపల్లి గ్రామానికి చెందిన వినోద్ కుమార్ ప్రస్తుతం నల్లమాడ గంగాహాల్ రోడ్డులో నివాసముంటున్నాడు. గురువారం మధ్యాహ్నం నల్లమాడ వైఎస్సార్ సర్కిల్ వద్ద ఎస్సై సతీష్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. ఇతనిపై జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో విశేషంగా కృషి చేసిన నల్లమాడ పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

## చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, పారిశ్రామిక రంగం పరుగులు

*రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీనారాయణ..*



**రొళ్ల (తెలుగోడు), మార్చి 26 :**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, పారిశ్రామిక రంగం పరుగులు పడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుంచిటిగా వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఐటి పారిశ్రామిక బ్రాండ్ గా నిలబెట్టిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ నీ మరో ఐటి పారిశ్రామిక రాష్ట్రం గా తిద్దీ తీర్చాలన్న ఒక సంకల్పంతో ముందుకు దూసుకు వెళ్తున్నారన్నారు.అందులో భాగంగా విశాఖలో గూగుల్ ఎ ఐ కంపెనీని తెచ్చి దేశంలోనే రాష్ట్రాన్ని ఒక బ్రాండ్ గా నిలబెట్టినారన్నారు.ఇది వెజినరి లీడర్ చంద్రబాబు నాయుడు కే సాధ్యమవుతుందాన్నారు అలాగే ప్రపంచ అగ్రగామి స్టీల్ సంస్థ ఆంధ్ర రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది . సుమారు 1,35,964 కోట్ల భారీ పెట్టుబడి ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పల్ స్టీల్ ప్లాంట్ పెట్టనుంది . ఇది ఒక చరిత్రత్మక ఘట్టం అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో దాదాపు 2600 ఎకరా లో నిర్మించనుందని 2029 లో పూర్తిస్థాయి ముగించుకుని మొదటి దశలో 7 మెట్రిక్ టన్ ఉత్పత్తి చేయనుంది .అలాగే 2033 సంవత్సరానికి 18 నుంచి 24 మెట్రిక్ టన్ పూర్తిస్థాయి ఉత్పత్తి చేయనుంది . దీనిలో భాగంగా దాదాపు 35 వేల మందికి ప్రత్యేక ఉద్యోగాలు మరియు రెండు లక్షల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు కల్పిస్తుంది . కోస్తా ఆంధ్రాలో వ్యవసాయపరంగా వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందిన జిల్లాలుగా పేర్కొంది . కానీ ఈరోజు నూతనంగా పారిశ్రామిక పరంగా అర్సెలర్ మిట్టల్ నిప్పల్ స్టీల్ ప్లాంట్ పెట్టుబడి పెట్టడం గర్వకారణంగా ఉంది . ఈరోజు దేశంలో కాదు ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మారుస్తున్న మన విజనరీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి అలాగే పరిశ్రామిక మంత్రి టీజీ భరత్ కి నిరుద్యోగుల పరంగా యూత్ పరంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున రాష్ట్ర కుంచిటిగా వక్కాలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ ధన్యవాదాలు తెలిపారు.



మైనర్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్ రెడ్డి

## మైనర్ల డ్రైవింగ్ పై ప్రత్యేక చర్యలు

**కోసిగి (తెలుగోడు), మార్చి 26 :**
మైనర్ డ్రైవింగ్ చట్టపరంగా నేరమని ప్రజల భద్రత దృష్ట్యా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్నట్లు మైనర్లకు గుర్తించి, మొత్తం 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలు, భవిష్యత్తులో వాటి ప్రభావాల గురించి వారికి సమగ్ర అవగాహన కల్పించబడినదని తెలిపారు. అలాగే, తిరిగి ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినంగా హెచ్చరికలు జారీ చేయబడినవన్నారు. అదనంగా, సంబంధిత వాహనాలపై చట్టపరమైన నిబంధనల ప్రకారం జరిమానాలు విధించబడినవవని భవిష్యత్తులో కూడా మైనర్ డ్రైవింగ్‌పై నిరంతర చర్యలు కొనసాగుతాయని తెలిపారు.



బ్యాంకు అధికారులను వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి

## బ్యాంకులు కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

**వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి..**

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 26 :**
కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని (కౌలు) వ్యవసాయ రైతులకు సంబంధిత బ్యాంకులు రుణాల మంజూరు చేయాలని గురువారం బ్యాంకుల అధికారులను కలిశారు. ఈ సంధర్భంగా సంబంధిత బ్యాంకు అధికారులతోఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మండలంలో ఆయా కౌలు రైతుల జాబితాను సంబంధిత బ్యాంకు బ్రాంచ్ లకు అందించినట్లు తెలిపారు. అలాగే ఆయా బ్యాంకు ల పరిధిలో ఉన్న కౌలు రైతులకు పంట సాగులో ఇబ్బందులు కలగకుండా కౌలు రుణాలు మంజూరు చేయించి పంట సాగును సులభతరం చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్న రైతులు ఆయా బ్యాంకు ల దగ్గరికి వెళ్లి సంబంధించిన ఫీల్డ్ ఆఫీసర్స్ ను కలవాలి అని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత బ్యాంకు మేనేజర్లు సుదర్శన్, నరసింహులు,రవీంద్ర బాబు,వీర పాల్గొన్నారు.




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## ఏబీవీపి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**సుండుపల్లె (తెలుగోడు), మార్చి 26 :**
టి సుండుపల్లె మండల కేంద్రంలోని కూడలి వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని సుండుపల్లె రక్షకభట అధికారి ఎస్ఎంకె హుస్సేన్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు తెలిపారు. విద్యార్థి సంఘాలు అంటే ఉద్యమాలకు మాత్రమే పరివితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనడం హర్షించదగ్గ విషయమని, ఈ సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మండల శాఖ నాయకులను ప్రత్యేకంగా అభినందనలను తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జీవన్ తో పాటు విద్యార్థి సంఘ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు

**అభినందన సభలో హైకోర్టు అదనపు న్యాయమూర్తి బాలాజి మెడమల్లి**

**సుండుపల్లె (తెలుగోడు), మార్చి 26 :**
క్రమశిక్షణ పట్టుదలతో ప్రతిఒక్కరు ఉన్నత శిఖరాలకు చేరుకోవాచ్చని ఆలా చేరాలంటే ఎవరికైనా క్రమశిక్షణ పట్టుదల ఉత్సాహం ప్రధానమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తి మెడమల్లి బాలాజి తెలిపారు. గురువారం సాయంత్రం న్యాయమూర్తి అత్త గారి ఊరైన వై యస్ ఆర్ కడప జిల్లా టి సుండుపల్లె మండలపరిధిలోని తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాలాజి పాఠశాలలో మండల స్థాయి నుంచి రాష్ట్ర, దక్షిణ భారత దేశ స్థాయిలో ఆపాఠశాల విద్యార్థులు చేసిన ప్రదర్శనను తిలకించారు. అభినందన సభలో మాట్లాడుతూ ప్రాంతమేదైనా ప్రతి ఒక్కరికి క్రమశిక్షణతో కూడిన పట్టుదల అవసరమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జస్టిస్ బాలాజీ కుటుంబ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.




అభినందనసభలో మాట్లాడుతున్న
హైకోర్టు అదనపు న్యాయమూర్తి బాలాజి మెడమల్లి

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చారిత్రాత్మక మైలురాయి

### ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ చారిత్రాత్మక ప్రాజెక్ట్.. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 26 :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేసే మహత్తర ప్రాజెక్ట్‌గా ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిలవనుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులతో ఏర్పడుతున్న ఈ స్టీల్ ప్లాంట్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోసే ప్రాజెక్ట్‌గా మారనుందని ఆయన పేర్కొన్నారు. గురువారం మంత్రాలయం మండలం మాధవరంలో ఆయన మాట్లాడుతూ సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ స్టీల్ పరిశ్రమ రాష్ట్ర పారిశ్రామిక రంగానికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. పరిశ్రమల విస్తరణతో పాటు ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా "జాబ్ ఫస్ట్ " విధానాన్ని అమలు చేస్తోందని రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమలకు అనుకూల విధానాలు, పారదర్శక పరిపాలన, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ కారణంగా ప్రపంచ స్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ విధానాలు రాష్ట్రాన్ని పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా మార్చుతున్నాయని తెలిపారు. ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా రాష్ట్రంలో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ ప్రాజెక్ట్ వల్ల అనుబంధ పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), రవాణా మరియు లాజిస్టిక్స్ రంగాలు కూడా వేగంగా అభివృద్ధి చెందనున్నాయని వివరించారు.



మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

దీనివల్ల రాష్ట్ర జీడీపీ వృద్ధికి తోడ్పాటు లభించడంతో పాటు ఎగుమతులు కూడా పెరిగే అవకాశం ఉందని చెప్పారు.
సుమారు 5,465 ఎకరాల విస్తీర్ణంలో ఈ భారీ ప్రాజెక్ట్ ఏర్పడనుందని తెలిపారు. దశల వారీగా అభివృద్ధి చెందనున్న ఈ ప్రాజెక్ట్ మొదటి దశలో 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభమవుతుందని చెప్పారు. తరువాత రెండో దశలో అది 10.5 మిలియన్ టన్నుల వరకు విస్తరించనున్నదని వివరించారు. 2030 నాటికి ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిశ్రమ స్థాపనతో యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, రైతులకు ఆర్థిక అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన తెలిపారు. స్థానిక ప్రాంతాల్లో రహదారులు, రవాణా, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని చెప్పారు. దీనివల్ల ఆ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలిచి, ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడంలో ముఖ్య పాత్ర పోషించనుందని తెలిపారు.

# గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

### కోసిగి మండలంలో రూ.5 కోట్ల పనులకు భూమి పూజ .. మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి..

**కోసిగి (తెలుగోడు), మార్చి 26 :**
ప్రజా అభివృద్ధే లక్ష్యంగా మంత్రాలయం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, కోసిగి మండలంలో మొత్తం రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి .రాఘవేంద్ర రెడ్డి తెలిపారు., గురువారం నాడు కోసిగి మండలం అగసనూర్ గ్రామం లో 600 మీటర్లు సీసీ రోడ్డు ,సాతనూరు గ్రామంలో500 మీటర్లు సీసీరోడ్డు బిటి రోడ్డు పనులకు నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు ఎన్.రాజారెడ్డి తో కలసి భూమి పూజ చేశారు. అలాగే గ్రామీణ రవాణా సౌకర్యాలను మెరుగుపర్చే దిశగా కందుకూరు క్రాస్ నుండి తుంబిగనూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల వ్యయంతో పనులను ప్రారంభించారు.



సాతనూరులో భూమిపూజ చేస్తున్న ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి



మాట్లాడుతున్న ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి

ఈ సందర్భంగా ఇంచార్జి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్లు, డ్రైనేజీ మరియు మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఏఈ విజయ్ నరేష్ కూటమి నాయకులు టీడీపీ మండల అధ్యక్షులు,పల్లెపాడు రామిరెడ్డి జక్కన గెని వెంకటేసులు వక్రాని వెంకటేసులు, తోవి రామకృష్ణ, హాలగుండా కోసిగయ్య , ముఖ్య నాయకులు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరించిన సీఎంకు కృతజ్ఞతలు

### సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు..

**కనేకల్ (తెలుగోడు), మార్చి 26 :**
అనంతపురం జిల్లా ఆశాదీపం ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ అనుమతికి విశేష కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేష్ బాబుకు, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబులు కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిలో గురువారం సాయంత్రం వారిద్దరిని వేర్వేరుగా కలుసుకుని జిల్లా ప్రజానీకం తరపున ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లడం, అనంతరం మంత్రివర్యులు నారా లోకేష్ బాబు పదేపదే పర్యవేక్షణ చేయటం వల్లే అనుమతులు లభించాయని కొనియాడారు. మీరు చేసిన గట్టి ప్రయత్న ఫలితమే ఈ రోజు కరువు పీడిత ప్రాంతాలకు ఆర్డిటి సేవలు కొనసాగించటానికి అవకాశం లభించిందని పేర్కొన్నారు.
అనంతపురం జిల్లా లాంటి వెనుకబడిన ప్రాంతంలో ఐదు దశాబ్దాలుగా లక్షలాది మంది పేదల జీవితాల్లో ఈ సంస్థ వెలుగులు నింపుతోందని వివరించారు. ఇది కేవలం ఒక సంస్థ సమస్య కాదని, జిల్లాలోని లక్షలాది మంది నిరుపేదల జీవన విధానంలో ఓ భాగంగా తాము భావిస్తున్నామని వెల్లడించారు. నిబంధనల అడ్డంకి కారణంగా 2021 లోనే ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ ఆగిపోయినా ఆనాటి వైకాపా పాలకులు ఏమాత్రం ఈ విషయంపై దృష్టి పెట్టలేదని తెలియజేశారు. వారి నిర్లక్ష్యం కారణంగా సేవలు కొనసాగించలేని పరిస్థితి ఆర్డిటి సంస్థకు వచ్చిందని తెలిపారు. అనుమతుల జాప్యం వల్ల సంస్థ ద్వారా అందుతున్న ఉచిత వైద్యం, విద్య, క్రీడా, గ్రామీణ అభివృద్ధి రంగాలు పూర్తిగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందని వివరించారు. ఈ పరిస్థితుల్లో 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న క్లిష్టమైన ఎఫ్.సి.ఆర్.ఎ నిబంధనలను అధిగమించి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించటానికి తీసుకొన్న ప్రత్యేక శ్రద్ధ, పట్టుదలను ప్రజలు ఏనాటికి మర్చిపోరన్నారు. అనంతపురం జిల్లా ప్రజల పట్ల, ముఖ్యంగా బలహీన వర్గాల పట్ల మీకున్న అపారమైన ప్రేమకు ఈ విజయం ఒక నిలువుటద్దమని వివరించారు. మీ నాయకత్వంలో జిల్లా మరింత పురోగతి సాధిస్తుందని తామంతా గట్టిగా విశ్వసిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవితమ్మ పాల్గొన్నారు.




సచివాలయంలో ముఖ్యమంత్రి కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు,అలిమినేని సురేంద్రబాబు

### అక్రమ కేసులు బనాయిస్తామని సిఐ దబాయింపు.. భార్యను అప్పగించండి.. సీఐపై చర్యలు తీసుకోవాలి.. అన్నమయ్య జిల్లా ఎస్పీకి ఓ యువకుడి ఫిర్యాదు.. బి.కొత్తకోట సీఐపై విచారణకు ఎస్పీ ఆదేశాలు..

**మదనపల్లె (తెలుగోడు), మార్చి 26 :**
ఏడేళ్ళుగా ప్రేమించుకున్నాం. పెద్దలను ఎదిరించి పెళ్ళి చేసుకున్నాం. అమ్మాయి వర్గం మిస్సింగ్ అంటూ బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారంరోజుల తర్వాత అనగా బుధవారం రాత్రి ఇరువురు కలసి బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్ సీఐ వద్దకు వెళ్ళడం జరిగింది. ఇరువర్గాలతో ఏలాంటి విచారణ చేయకుండా.. నా భార్య హారికను సీఐ వారి తల్లిదండ్రులు అప్పగించి.. వెంటపెట్టి పంపించేశారు. ఇదేమని అడిగితే.. ఎక్కువ మాట్లాడితే కేసులు బుక్ చేసి జైల్లో పెడుతానంటూ బి.కొత్తకోట సీఐ దౌర్జన్యం, బెదిరింపులకు గురిచేశారు. నా భార్యను నాకు అప్పగించాలని అడిగితే.. పట్టించుకోకుండా పోలీస్ స్టేషన్ నుంచీ బయటకు పంపించేశారని.. బాధితుడు గురువారం అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలం

# ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను దూరం చేశారు..

మద్దినాయునిపల్లి పంచాయతీ బూడిదగడ్డపల్లికి చెందిన ముక్కండ్ల ఉత్తన్న చిన్న కుమారుడు వినోద్‌కుమార్ ఇంటర్ వరకు చదువుకొని మోల్డింగ్ కమ్మి బెండింగ్ పనులు చేసుకుంటున్నాడు. బి.కొత్తకోట మండలంలో ఇంటర్ చదువుతున్న సమయంలో.. బి.కొత్తకొట మండలం సూరపువారిపల్లి పంచాయతీ దయ్యాలచారిపల్లికి చెందిన జయరామిరెడ్డి కుమార్తె హారికతో పరిచయమైంది. గత ఏడేళుగా ఇరువురు ప్రేమించు కుంటున్నాము. కులాలు వేరు కావడంతో హారిక తల్లిదండ్రుల అభ్యంతరం చేశారు. ఏడాది కితమే వినోద్‌కుమార్, హారికలు ఇంటినుంచీ వెళ్ళి పోయారు. అందరి సమక్షంలో పెళ్ళి చేస్తామని హామీ ఇచ్చి వేరు చేశారు. అయితే హారికకు పెళ్ళి సంబంధాలు చూస్తుండటంతో గత నెల 25న ఇద్దరు ఇంటి నుంచీ వెళ్ళిపోగా.. మరలా పిలిపించి పోలీసులు, పెద్దలు కలసి పంచాయతీ చేశారు. అయితే పదిరోజుల కితం ప్రేమికులు ఇరువురూ.. ఇంటినుంచీ వెళ్ళిపోయి.. ఒరిస్సాలో పేట గ్రామంలోని అమ్మవారి ఆలయంలో వివాహం చేసుకున్నారు. వారంరోజుల తర్వాత హారిక మొబైల్ లొకేష్ ఆధారంగా బి.కొత్తకోట పోలీసులు ఫోన్ చేసి పోలీస్ స్టేషనుకు రమ్మన్నారు. నిన్నటిరోజు అనగా బుధవారం రాత్రి 7.30గంటలకు బి.కొత్తకోట పోలీస్ స్టేషన్‌ము చేరుకున్నారు. ప్రేమికులు ఇరువురూ మేజర్లు. అయినా ప్రేమించి పెళ్ళి చేసుకున్న హారికను ఏలాంటి విచారణ చేయకుండానే సీఐ వారి తల్లిదండ్రులకు అప్పగించి పంపించి వేయడంపై అబ్బాయి తరపున బంధువులు సీఐని నిలదీశారు. ఎవరైనా మాట్లాడితే కేసులు నమోదు చేస్తామని సీఐ బెదిరింపులు చేస్తూ.. బయటకు పంపించేశారంటూ బాధితుని బంధువులు, కుటుంబసభ్యులు సీఐపై తిరుగు బావుటా చేశారు. బాధితుడు వినోద్‌కుమార్ నా భార్యను నాకు అప్పగించి సీఐపై చర్యలు తీసుకోవాలని గురువారం మదనపల్లెలోని అన్నమయ్య జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బి.కొత్తకోట సీఐపై విచారణకు ఆదేశిస్తూ.. జిల్లా ఎస్పీ దీరజ్ కునుబిల్లి అడిషనల్ ఎస్పీకి ఆదేశించారు.



ఎస్పీకి ఫిర్యాదు చేసిన వినోద్ కుమార్

## కమలపాడు. కుందన కోటలో ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయరాదు

**తహసిల్దార్. ప్రతాపరెడ్డి..**

**యాడికి (తెలుగోడు), మార్చి 26 :**
జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎపిజెన్‌కోకు భూసేకరణ నిమిత్తం యాడికి మండలంలోని కుందన కోట. కమలపాడు గ్రామాలలో 398.468 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పట్టా భూముల సేకరణ – ఫారం సి ఆమోదం – భూసేకరణ ప్రక్రియ దృష్ట్యా ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరుపరాదని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

## నేడు, రేపు రాష్ట్రంలో తీవ్ర వడగాల్పులు

**అమరావతి, మార్చి 26:**
రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలు, పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, కాకినాడ జిల్లా జగ్గంపేట, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ , ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో శుక్రవారం తీవ్ర వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారం విజయనగరం 4, పార్వతీపురం మన్యం 3, పోలవరం 3, కాకినాడ 1, తూర్పుగోదావరి 2, ఏలూరు 4, కృష్ణా 2, ఎన్టీఆర్ 7, గుంటూరు 1, పల్నాడు జిల్లాల్లోని 5 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. శనివారం 90 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు.
గురువారం కడప జిల్లా కమలాపురంలో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 40.6 డిగ్రీలు, కృష్ణా జిల్లా పెద్దపారుపూడిలో 40.5 డిగ్రీలు, నంద్యాల జిల్లా కొత్తపల్లెలో 40.4 డిగ్రీలు, కర్నూలు జిల్లా బస్తిపాడులో 40.3 డిగ్రీలు, చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలని ప్రఖర్ జైన్ సూచించారు. వృద్దులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. చెవుల్లోకి వేడి గాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలన్నారు.

## సచివాలయంలో మంత్రి అచ్చెన్న పుట్టినరోజు వేడుకలు


**అమరావతి, మార్చి 26:**
వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో సీఎం ఛాంబర్‌లో మంత్రుల సమక్షంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా కేక్ కట్ చేయించి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యువనేత, మంత్రి నారా లోకేష్ సమక్షంలో క్యాబినెట్ మంత్రులంతా కలిసి కేక్ కట్ చేసి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపిస్తూ ఆత్మీయ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అచ్చెన్నాయుడు చేసిన కృషిని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా ప్రజల అభ్యున్నతికై నిత్యం ఆలోచిస్తూ, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆయా శాఖల అభివృద్ధికి పాటుపడి రాష్ట్ర పురోగతికి బాటలు వేసిన నాయకుడిగా ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సమక్షంలో తన జన్మదిన వేడుకలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి తనపై ప్రత్యేక వాత్సల్యంతో స్వయంగా కేక్ కట్ చేయించి ఆశీర్వదించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన యువనేత నారా లోకేష్, మంత్రివర్గ సహచరులు, ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి ఆత్మీయత, ఆశీస్సులు తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, రైతన్నల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



# వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు

### రాష్ట్ర కేబినెట్ నిర్ణయం

**విజయవాడ (తెలుగోడు), మార్చి 26 :**
అమరావతి: యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా సాకారం చేస్తున్నారు యువనేత నారా లోకేష్. తాము కులవృత్తి చేసుకుని జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వ కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ లీజులు ఇవ్వాల్సిందిగా పాదయాత్ర సమయంలో వడ్డెర సోదరులు మంత్రి లోకేష్ కు విన్నవించారు. వారికి ఇచ్చిన మాట ప్రకారం వడ్డెరలకు మైనింగ్ లీజులు కేటాయించే అంశాన్ని మంత్రి లోకేష్ తాజాగా కేబినెట్ ముందుకు తెచ్చారు. వడ్డెర సోదరుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను పెంచడానికి వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులను కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయి విధివిధానాలతో త్వరలోనే ప్రభుత్వం జీవో జారీ చేయనుంది. యువగళం పాదయాత్ర సమయంలో యువనేత లోకేష్ ప్రతిరోజూ వివిధ సామాజిక వర్గాల ప్రజలతో సమావేశమై వారి మనోగతాన్ని తెలుసుకున్నారు. ఆ సమయంలో వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ మాట నిలబెట్టుకుంటున్నారు. గత వైసీపీ వివిధ సామాజికవర్గాలను కేవలం ఎన్నికల్లో ఓట్లకోసం మాత్రమే ఉపయోగించుకొని, అవసరం తీరాక గాలికొదిలేసింది. అటువంటి ఓటుబ్యాంకు రాజకీయాలకు స్వస్తిపలుకుతూ వివిధ సామాజిక వర్గాల మనోభీష్టాన్ని నెరవేరుస్తున్నారు.




# చిత్తూరు పార్లమెంటులో పెరగనున్న 3 అసెంబ్లీ స్థానాలు!

**చిత్తూరు (తెలుగోడు), మార్చి 26 :**
లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను 50 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చిత్తూరు, కుప్పం, పలమనేరు, పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాలు పూర్తిగా, నగరి, పుంగనూరు నియోజకవర్గాలు పాక్షికంగా జిల్లాలో ఉన్నాయి. ఈ విభజన లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు వర్తిస్తుంది. లోక్‌సభ స్థానాల వారీగా విభజన చేస్తే చిత్తూరు పార్లమెంటులోని 7 అసెంబ్లీ స్థానాలు 10 లేదా 11కి చేరనున్నాయి. అలాగే చిత్తూరు, తిరుపతితో పాటు మరో లోక్‌సభ స్థానం ఏర్పాటు కానుంది. కొత్తగా బంగారుపాళ్యం, పాకాల, పుత్తూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయి. రాజకీయ వర్గాల అంచనాల మేరకు ... బంగారుపాళ్యం, పాకాల, పుత్తూరు నియోజకవర్గాలు కొత్తగా ఏర్పాటు కానున్నాయి. బంగారుపాళ్యంలో గుడిపాల, బంగారుపాళ్యం, తవణంపల్లె, యాదమరి మండలాలు ఉండొచ్చు. పాకాలలో పులిచెర్ల, రొంపిచెర్ల, పాకాల, పెనుమూరు ఉండొచ్చని ఓ అంచనా. అలాగే 2009కు ముందు ఉన్న పుత్తూరు నియోజకవర్గం మళ్లీ ఏర్పాటయ్యే అవకాశముంది. ఇక్కడ పుత్తూరు, వడమాలపేట, కార్వేటినగరం మండలాలకు మరొకటి జత చేయొచ్చు. నగరి, నింద్ర, విజయపురం మండలాలకు మరొకటి జత చేసి నగరి నియోజకవర్గాన్ని అలాగే ఉంచనున్నారు.

ఇటీవల చేపట్టిన జిల్లాల పునర్విభజన సమయంలో పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలను అన్నమయ్య జిల్లాలో కలపకుండా ఉంచేశారు. అలాగే చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న నగరి నియోజకవర్గంలోని మూడు మండలాలనూ తిరుపతిలో కలపలేదు. అసెంబ్లీ స్థానాల పునర్విభజన సమయంలో ప్రక్రియ సులువుగా సాగేందుకు ప్రభుత్వ పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

చిత్తూరు పార్లమెంటులోని చంద్రగిరి నియోజకవర్గం తిరుపతికి సమీపంలో ఉండడంతో దాన్ని తిరుపతి జిల్లాలో కలిపేశారు. కానీ, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పాకాల కొత్త నియోజకవర్గంగా ఏర్పడనుంది. అప్పుడు పాకాలను కచ్చితంగా చిత్తూరు జిల్లాలో కొనసాగిస్తారని రాజకీయ వర్గాల విశ్లేషణ. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉన్న ఒక్క పాకాల మండలాన్ని తీసుకుని చిత్తూరు జిల్లాలోని మిగిలిన మండలాలతో పాకాల నియోజకవర్గాన్ని ఏర్పాటు చేస్తారని సమాచారం.

కుప్పం నియోజకవర్గంలో ప్రస్తుతం నాలుగు మండలాలున్నాయి. ఇక్కడ పెద్దగా మార్పుచేర్పులు ఉండకపోవచ్చు. కానీ, పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం గతంలో పుంగనూరు నియోజకవర్గంలో ఉండేది. ఈ మండలాన్ని మార్చే అవకాశాలున్నాయి. అప్పుడు పలమనేరు, వి.కోట, బైరెడ్డిపల్లె, గంగవరం మిగిలి ఉంటాయి. అలాగే 2009కు ముందులాగే పీలేరు, వాయల్పాడు రెండు వేర్వేరు నియోజకవర్గాలు కానున్నాయి.



సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సహచర మంత్రులు



# మార్కాపురం బస్సు ప్రమాదంలో తల్లీకూతురు మృతి

### ఆత్మీయులను దూరం చేస్తున్న బస్సు ప్రమాద ఘటనలు.. కుటుంబంలో విషాదఛాయలు..

**ఉదయగిరి కొండాపురం (తెలుగోడు), మార్చి 26 :**
కొండాపురం మండలం తూర్పు ఎర్రబల్లి గ్రామానికి చెందిన ౖ నర్సింగ్ ప్రభావతి, ఆమె కూతురు హరికృష్ణ ట్రావెల్స్‌లో ప్రయాణిస్తూ మార్కాపురంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమని తెలుగుదేశం పార్టీ నాయకులు మోదేపల్లి శ్రీకాంత్ అన్నారు. ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతూ అనేకమంది ప్రయాణికులను పొట్టను పెట్టుకున్నాయన్నారు. ఇలాంటి ఘటనల్లో ఆత్మీయులను కోల్పోవడంతో ఎన్నో కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోతున్నాయన్నారు. బస్సు ప్రమాదం గురించి తెలియగానే స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మోదేపల్లి శ్రీకాంత్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ విషయాన్ని వెంటనే స్థానిక మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబు నాయుడు, శాసనసభ్యులు కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన శాసనసభ్యులు కాకర్ల సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన ప్రయాణికుల వివరాలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అవసరమైన సహాయక చర్యలు వేగవంతంగా తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. . ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరక్కుండా ప్రభుత్వం, రవాణా శాఖ అధికారులు ప్రయాణికుల భద్రతను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.




ఆసుపత్రి వద్ద మృతుల బంధువులు



బస్సు ప్రమాదంలో మృతి చెందిన ప్రభావతి, ఆమె కూతురు

# గిరిజన బాలిక అనుమానాస్పద మృతి

**హిరమండలం (తెలుగోడు), మార్చి 26 :**
మండలంలోని పాత హిరమండలానికి చెందిన గిరిజన బాలిక తోట జయంతి(17) అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల ఇలా ఉన్నాయి. తోట శ్రీను, రోది దంపతులకు జయంతి ఏకైక కుమార్తె. గ్రామాల్లో తోట శ్రీను కుటుంబ సభ్యులు సర్కస్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. జయంతి విజయనగరం జిల్లా ఎస్ కోట జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. సెకండీయర్ పరీక్షలు రాసి పాత హిరమండలం వచ్చింది. గత కొన్నేళ్లుగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలవలా వెంకటేశ్వర రావు పరిచయాలు కలిగి ఉన్నారు. కుమార్తెను ట్యూషన్‌కు పంపించి విద్యాప్రమాణాలు మెరుగుపరచనున్నట్లు వెంకటేశ్వరావు కుటుంబ సభ్యులను నమ్మించారు. వెంకటేశ్వరరావు మాటలకు నమ్మి మార్చి 22 తేదీన కుమార్తెను తండ్రి శ్రీను అప్పగించారు. రెండు రోజులు తర్వాత పాప ఆరోగ్యం బాగోలేదని తెలిపినట్లు తల్లిదండ్రులు తెలిపారు. వెంకటేశ్వరావు తన కారులో శ్రీను తమ్ముడు స్వగ్రామమైన పాలకొండ మండలం మజ్జి రాముడుపేటకు తీసుకువచ్చి ఫోన్ చేసినట్లు శ్రీను తెలిపారు. మరలా పాత హిరమండలం తీసుకు వచ్చినట్లు తెలిపారు. కుమార్తె కొన ఊపిరితో ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వెంకటేశ్వరరావు కారులో జెమ్స్ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా మృతి చెందినట్లు శ్రీను తెలిపారు. కుమార్తె మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతిరాలు తల్లి రోది ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిరమండలం ఎస్ ఐ హేమంత్ కళ్యాణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన జయంతి

# క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

**విజయవాడ (తెలుగోడు), మార్చి 26 :**
ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం పురస్కరించుకుని డీఎల్ఎండీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ బీ భానూనాయక్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీ భానూనాయక్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని ఆరంభంలోనే గుర్తించేందుకు అధునిక పద్ధతులు వచ్చాయన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ గతంతో పోలిస్తే క్షయ వ్యాధి చికిత్సలో అనేక మార్పులు వచ్చాయన్నారు. అలాగే టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారంను అందజేస్తున్న వాసవ్యమహిళా మండలి, సత్యసాయి సేవాసంస్థలను అభినందించారు. డీసీ హెచ్ఎస్ డాక్టర్ మాధవి, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ ధీరజ్ వాసవ్య మహిళా మండలి కార్యదర్శి గోపరాజు రశ్మి, డాక్టర్ భానూనాయక్ మాట్లాడారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లాలో మంచి పనితీరు కనబర్చిన ఉద్యోగులకు జ్ఞాపిక ప్రశంస పత్రం అందజేశారు.
తొలుత రాబర్ట్ కాచ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీబీ సోకిన వారికి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ మధు, ఫోరంఫర్ చైల్డ్ రైట్స్ కో ఆర్డినేటర్ అరవ రమేష్, ఎస్టఓ రామారావు, టీబీ హెచ్ఐవి కోఆర్డినేటర్ జీ తిరుపతమ్మ జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత పాత ప్రభుత్వాసుపత్రి నుంచి ఐఎంఏ హాలు వరకు అవగాహన ర్యాలీ నిర్వ హించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర లయోలా ఇంజినీరింగ్, కె వి ఎస్ ఆర్ సిద్ధార్థ ఫార్మసీ, సెయింట్ ఆన్స్ నర్సింగ్, గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవంలో మాట్లాడుతున్న డీఎల్ఎండీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ బీ భానూనాయక్



ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది

### హోం మంత్రి అనిత.

**విజయవాడ (తెలుగోడు), మార్చి 26 :**
మార్కాపురం మండలం రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి. అనిత వెల్లడించారు. గురువారం ఆమె డిజిపి హర్ని కుమార్ గుప్తా, రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ పి రాజబాబు, ఎస్పి హర్షవర్ధన్ రాజు లతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈ రోడ్డు ప్రమాదం దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆవేదన చెందారు. రోడ్డు ప్రమాదంలో 13 మంది మరణించారని, 28 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం కొంతమందిని ఒంగోలు గుంటూరుకు తరలించామని తెలిపారు. ప్రమాద ఘటనపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బస్సు ప్రమాదాలపై ప్రత్యేక టాస్కోఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇటువంటి రోడ్డు ప్రమాదాలు జరగటం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. త్వరలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చట్టాలు తీసుకొస్తామన్నారు. కలెక్టర్ పి. రాజబాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఆస్పత్రిలో ఉన్న క్షతగాత్రులకు పూర్తిగా కోలుకొని ఇంటికి వెళ్లే వరకు అని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మార్కాపురం కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇంచార్జి ఎరిక్షన్ బాబు, రవాణా శాఖ జిల్లా అధికారి సుశీల, డిఎస్పి నాగరాజు వీరి వెంట ఉన్నారు.



మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి



ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి అనిత , మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి

# పొలాల్లో దిబ్బలను తొలగించే అధికారం రెవెన్యూ అధికారులకు ఉందా

### మైనింగ్. విజిలెన్స్ అధికారులకు వీఆర్వో పై ఫిర్యాదు.

**సంగం (తెలుగోడు), మార్చి 26 :**
మండలంలోని సిద్దిపురం గ్రామపంచాయతీ పరిధి మజీర గ్రామం అనసూయ నగర్‌లో ప్రభుత్వ భూములకు సంబంధించి అక్రమంగా మట్టిని విక్రయించుకునేందుకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వడం పట్ల స్థానిక వీఆర్వోపై గ్రామస్తులు మైనింగ్ అధికారులకు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మైనింగ్ అధికారులు కోట్లాది రూపాయల ఖర్చు చేసి ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలు ఉన్నాయని, ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ వచ్చిన వెంటనే అధికారులను మార్చిన వారి పనితీరు మాత్రం యధావిధిగానే కొనసాగుతున్నాయని స్థానికులు అంటున్నారు. అనసూయ నగర్ గ్రామంలో సర్వే నంబర్ 426./ఎ3లో 97 సెంట్లు భూమి పట్టాభూమి ఉందని ఈ భూమిని అన్నారెడ్డి పాలెం గ్రామానికి తరలించేందుకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారని అంటున్నారు. రెవెన్యూ చట్టం ప్రకారం పొలంలో మట్టిని ఎత్తినా చదును చేసిన అక్కడి వరకే చేసుకోవలసిన అవసరం ఉన్నరని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఇతర గ్రామాలకు తరలించేందుకు రెవెన్యూ అధికారులకు అనుమతి లేదని స్థానికులు అంటున్నారు. పొలం పట్టా కావచ్చు కానీ అందులో ఉన్న దిబ్బలు మాత్రం ప్రభుత్వానివే అన్న సంగతి రెవెన్యూ అధికారులకు తెలియదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఇలాంటి పొరపాట్లు రెవెన్యూ అధికారులు చేయకూడదని మరోసారి చేస్తే వారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయక తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



కదిరిలో నేతల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

# బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో పాలాభిషేకం

**కదిరి (తెలుగోడు), మార్చి 26 :**
ఆర్డీటీకి 'విదేశీ విరాళాల నియంత్రణ చట్టం' నమోదు పునరుద్ధరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం వెలువడిన సందర్భంగా ఈ అంశానికి సంబంధించి సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌రే అభినందనలు తెలుపుతూ కదిరిలో వారి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.
అవిభక్త అనంతపురం జిల్లా ప్రజల సామాజిక–ఆర్థిక పరిస్థితులు, =ఖ సంస్థ అందించిన సేవలు, గ్రామీణాభివృద్ధికి ఆ సంస్థ చేసిన కృషి వంటి వివిధ అంశాలపై అవగాహన చేసుకోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. కేంద్రం ప్రభుత్వాన్ని ఒప్పించడంలో రాష్ట్ర నాయకత్వం కీలక పాత్ర పోషించిందని స్థానిక నాయకులు పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో బీజేపీ జనసేన పార్టీల ఆధ్వర్యంలో కదిరి పట్టణంలోని శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం వద్ద ఈ ప్రక్రియలో పాలుపంచుకున్న ముఖ్య నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేనలకు చెందిన స్థానిక బీజేపీ రాష్ట్ర నాయకులు ఉత్తమ్ రెడ్డి, జనసేన అసెంబ్లీ ఇన్చార్జి బైరవప్రసాద్, బీజేపీ, జనసేన జిల్లా నేతలు , రవికుమార్,సుదర్శన్, అంజి, హస్నాపురం చంటి, చిన్నపరెడ్డి, డిఎల్ ఆంజనేయులు, ప్రసాద్, నాగార్జున, మైనుద్దీన్, రమేష్, అంజిబాబు, రాజేంద్ర ప్రసాద్, గంగరాజు, రవీంద్ర, సోమశేఖర్, రాజారామ్, రామమోహన్, హరి బాబు, శరత్ కుమార్ నంది శెట్టి బాబు, కృష్ణమూర్తి, కుటాగుల సూరి, వడ్డెర సంఘం అధ్యక్షుడు సైదాపురం రమణ, గంగాధర్ తదితరులు పాల్గొని తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని బీజేపీ, జనసేన నాయకులు పేర్కొంటూ, ఈ ప్రక్రియకు సహకరించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పాలాభిషేకం నిర్వహించారు.

# నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాలే కేటాయించాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జెఎన్‌జేహెచ్ఎస్ సభ్యుల విజ్ఞప్తి

**హైదరాబాద్ (తెలుగోడు), మార్చి 26 :**
వెయ్యి మంది జర్నలిస్టుల కుటుంబాలను రోడ్డున పడేసే కమిటీ పెద్దల కుట్రలపై విచారణ జరిపించాలని. పేట్ బషీరాబాద్, నిజాంపేట్ స్థలాలనే కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ సభ్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 16 ఏళ్ల నుంచి తాము పడుతున్న కష్టాలను మీడియా ముందు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీరే మాకు దిక్కంటూ వేడుకున్నారు.
సొసైటీ ఏర్పడిన నాటి నుంచి సభ్యులను కమిటీ పెద్దలు మభ్యపెడుతూ కుట్రలకు పాల్పడ్డారని.. ప్రభుత్వాలు ఇచ్చిన నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాలను కుట్రపూరితంగా డెవలప్ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని జెఎన్‌జే హెచ్ ఎస్ సభ్యులు ఆరోపించారు. నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాల్లో అక్రమ కట్టడాల వెనకాల అప్పటి కమిటీ పెద్దలు ఉన్నారని, వారిపై విచారణ చేపడితే వారి మోసాలన్నీ బయటకు వస్తాయన్నారు.
2008లో జెఎన్‌జే సొసైటీ ఏర్పడిన తర్వాత ఒక్కక్కరి నుండి 2లక్షల చొప్పున దాదాపు 23 కోట్ల రూపాయలు వసూలు చేశారని, అందులో 12.33 కోట్ల రూపాయలు మాత్రమే ప్రభుత్వ ఖజానాకు జమ చేశారన్నారు. అప్పటి నుండి సభ్యుల డబ్బులను దుబారా చేయడమే కాకుండా...ఎలాంటి జీబీలు, సమావేశాలు, ఎన్నికలు నిర్వహించకుండా ఏకపక్షంగా సొసైటీని నడిపించారని ఆరోపించారు. సభ్యులు అఫిడవిట్ ఇచ్చి స్థలాలు తీసుకోవచ్చని 2010లో హైకోర్టు చక్కని రూలింగ్ ఇచ్చినా... సభ్యులకు తెలియజేయకుండా దాచిపెట్టడమే గాక, కనీసం జీబీ లేకుండా సుప్రీంకోర్టుకు తీసుకెళ్లారని జర్నలిస్టు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో డెవలప్ చేసుకోవచ్చని, 2022లో నిర్మాణాలు చేపట్టవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఆ తీర్పును కాలదోషం పట్టించి సభ్యులను కమిటీ పెద్దలు నిండా ముంచారని తెలిపారు. మరోవైపు నిజాంపేట్ , పేట్ బషీరాబాద్‌లో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తూ లాభం పొందినట్లు సభ్యులు ఆరోపించారు.
పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నపుడు రేవంత్ రెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకెళితే సావధానంగా విని, అధికారంలోకి వచ్చిన వెంటనే పేట్‌బషీరాబాద్ స్థలాన్ని అప్పగించినందుకు సభ్యులు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఎంతో ఉదారంగా ఇచ్చిన స్థలాన్ని కూడా కమిటీ పెద్దలు కుట్రపూరితంగా హ్యాండోవర్ చేసుకోకుండా తమ పొట్ట కొట్టారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ పెద్దల తీరుతో ఇప్పటికే చాలా అన్యాయమై పోయిన తమను ముఖ్యమంత్రి ఆదుకోవాలని, ఏ స్థలాల కోసం 16 ఏళ్ల కిందట డబ్బులు కట్టామో వాటిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ఉద్యోగ బాధ్యతలు చూస్తున్న జర్నలిస్టులకు నగరానికి సుదూరంగా ఇవ్వడం సరికాదన్నారు. ఇక్కడ కూడా బడుగు జర్నలిస్టుల పొట్టకొట్టడానికి బడా జర్నలిస్టుల పేరిట అవే కుట్రలు జరుగుతున్నాయని, వారిని దూరంగా ఉంచాలని ముఖ్యమంత్రిని కోరారు. ఇప్పటికే దాదాపు 90 మంది సభ్యులు చనిపోయారని, మరో 200 మందికి పైగా జర్నలిస్టులు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ ఇస్తే... 16 ఏళ్ల నుంచి తమపై జరుగుతున్న మోసాలు, తాము పడుతున్న కష్టాలను వివరిస్తామని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యులు వేడుకున్నారు.





హౌసింగ్ ఏఈ, ఐకెపి ఎపిఎంలతో మాట్లాడుతున్న హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణమ్మ

## లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి

### హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణమ్మ ..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 26 :**
గత ప్రభుత్వ కాలంలో ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఆమె పర్యటించి, సంబంధిత అధికారులతో కలిసి నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన ఆమె, ఇప్పటికీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని వారు వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని హెచ్చరించారు. లేకపోతే మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేసే అవకాశముందని తెలిపారు. అనంతరం భవిష్యత్తులో ఇళ్ల మంజూరు కూడా పొందలేరని స్పష్టం చేశారు. అదేవిధంగా హౌసింగ్ ఏఈ విశ్వనాథ్,లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ సమన్వయం చేసి నిర్మాణాలు వేగవంతం చేయాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. సుమారు రెండు వందల ఇళ్లు పునాది దశలో ఉండగా, మరో నివాస ప్రాంతంలో డెబ్బై ఐదు, ఇందిరమ్మ కాలనీలో ఇరవై ఐదు ఇళ్లు పునాది దశలో ఉన్నట్లు గుర్తించారు. ఇంకా పైకప్పు దశకు చేరని ఇళ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తే తదుపరి దశల నిర్మాణాలు పూర్తి చేసే అవకాశం ఉందని ఏటీఎం హరిప్రసాద్ కు సూచించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయంపై కూడా ఈ సందర్భంగా వివరించారు. ప్రధాన గృహ నిర్మాణ పథకం కింద ఒక లక్ష యాభై వేల రూపాయలు, ఉపాధి హామీ పథకం కింద ఇరవై ఏడు వేల రూపాయలు అందుతున్నాయని తెలిపారు. అదనంగా సామాజిక వర్గాల వారీగా ప్రత్యేక పథకాల కింద ఎస్సీలకు యాభై వేల రూపాయలు, వెనుకబడిన వర్గాలకు యాభై వేల రూపాయలు, గిరిజనులకు డెబ్బై ఐదు వేల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇళ్ల మంజూరు పొందిన వారు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉంటే వారికి అదనంగా రుణ సౌకర్యం కల్పించేలా జాబితాను సిద్ధం చేసి సంబంధిత అధికారులకు అందజేశారు. ఆ జాబితాను సంబంధిత సిబ్బందికి పంపించి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ విభాగం సిబ్బంది, మండల స్థాయి అధికారులు, వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నయారా




**ఢిల్లీ, మార్చి 26 :**
పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో చమురు రవాణాపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో భారత్‌లోని అతిపెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్ నయారా ఎనర్జీ చమురు ధరలను పెంచింది. లీటర్ పెట్రోల్‌పై రూ.5, లీటర్ డీజిల్‌పై రూ.3 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సంబంధిత వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి.

## పునర్విభజన దేనికోసం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 పరిపాలనా సౌలభ్యం కోసం ప్రాంతాలను, నియోజకవర్గాలను పునర్విభజన చేయవచ్చని చెబుతుంది. అయితే నేడు జరుగుతున్న పునర్విభజనలు కేవలం రాజకీయ పార్టీల ప్రాబల్యం కోసమే.ఎక్కడ ప్రజా సౌలభ్యం కనబడదు.

ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధంగా ఏ ప్రక్రియ జరిగినా,దానివల్ల ప్రజలకు మేలు జరగాలి. అయితే నేడు దేశవ్యాప్తంగా 2011 జనాభా ప్రాతిపదికన 50 శాతం ఎంపీ,ఎమ్మెల్యే స్థానాలను పెంచడం,పాలనా సౌలభ్యం,చట్టసభల నాణ్యతను పెంచడం, రాజకీయ ముఖచిత్రాన్ని మార్చడం కోసమే అయితే ఇదివరకు చాలా సార్లు పునర్విభజనలు జరిగాయి మరి ఎక్కడా ప్రాంతాల సమతుల్యత గాని,చట్టసభల నాణ్యత గాని,రాజకీయ ముఖచిత్రం మారిన దాఖలాలు కానీ కనపడవు. ఇవి అన్నీ పునర్విభజనకు ముందు రాజకీయ పార్టీలు చెప్పే ఆనవాయితీ మాటలు గానే మిగిలిపోతున్నాయి.



కెవిఆర్ విశ్లేషణ

ప్రస్తుతం జరుప తలపెట్టిన పునర్విభజన ప్రక్రియ బిజెపి నాలుగవ సారి అధికారం చేపట్టడానికి ఉపయోగపడవచ్చునేమో కానీ ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదు.

పునర్విభజన వల్ల బిజెపి మెజారిటీ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఉత్తర భారత దేశంలో జనాభా నియంత్రణ లేని కారణంగా 2011 జనాభా ప్రామాణికంగా ఎంపీ సీట్లు గణనీయంగా పెరుగుతాయి.ఉదాహరణకు ఉత్తరప్రదేశ్ లో ఇప్పుడున్న 80 సీట్లకు గాను 120 సీట్లు,మధ్యప్రదేశ్, రాజస్థాన్,బీహార్ రాష్ట్రాలలో రెట్టింపు అవుతాయి.తద్వారా 2029 ఎన్నికలలో లబ్ధి పొందవచ్చు.అదే సందర్భంలో దక్షిణ భారతదేశంలో కుటుంబ నియంత్రణ కఠినంగా అమలు జరిగిన కారణంగా 2011 జనాభా ప్రామాణికంగా ఎంపీ సీట్లు గణనీయంగా తగ్గిపోతాయి,ఉదాహరణకు దక్షిణ భారతదేశంలోని తమిళనాడు,పుదుచ్చేరిలలో ఇప్పుడున్న 40 సీట్లకు గాను కేవలం 60 సీట్లు, నవ్యాంధ్ర ప్రదేశ్ లో 25 సీట్లు గాను 37 సీట్లు మాత్రమే పెరుగుతాయి,తద్వారా ఒకే దెబ్బకు రెండు పిట్టలు కొట్టినట్లు,అటు ఉత్తర భారత దేశంలో ఎంపీ సీట్లు పెరగడం వల్ల అధికారం చేపట్టవచ్చు, అదే సందర్భంలో పార్లమెంటులో ఉత్తర భారతానికి ప్రాధాన్యతను పెంచవచ్చు,దక్షిణ భారతదేశంలో ఎంపీ సీట్లను తగ్గించి ఇక్కడ బలంగా ఉన్న రాజకీయ పార్టీలను బలహీనపరచవచ్చు,దక్షిణ భారతానికి పార్లమెంటులో ప్రాధాన్యత లేకుండా చేయవచ్చు.

15 సంవత్సరములుగా జరగని జనాభా లెక్కలు 2027 లో జరుప తలపెట్టి,ఆ లెక్కలు వచ్చే వరకు ఆగకుండా ఆగమేఘాల మీద పునర్విభజనను ప్రకటించడం,అందులోనూ దక్షిణ భారతదేశంలో వివాదం రాకుండా 2011 జనాభా ఆధారంగా 50 శాతం సీట్లు పెంచుకునే వెసులుపాటు కల్పించి శాంతపరచడం వెనుక మతలబు,ఉత్తర భారత దేశంలో సీట్లు పెరగకుండా 2029 ఎన్నికలలో గెలవడం బిజెపికి కష్టం కాబట్టి.

ఒకవేళ ఈ ప్రక్రియ వల్ల ప్రాంతాల మధ్య సమతుల్యత,అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుంది అనుకుంటే 2014లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్ ఎందుకు కష్టాల కడలిలో మునుగుతున్నది?అభివృద్ధి కేంద్రీకరణ జరుగుతున్నది? అంతకు మునుపు విడిపోయిన రాష్ట్రాలు కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఎందుకు ఉన్నట్లు?

ఇక చట్టసభల నాణ్యత పెరుగుతుంది అనుకుంటే నేడు చట్ట సభలు అలంకారప్రాయాలుగా మారి,ఏకపక్షంగా చట్టాలను చేస్తూ,బిల్లులను ఆమోదిస్తూ, వ్యవస్థలను మరింత బలహీన పరుస్తున్నాయి కదా. ఇక రిజర్వేషన్ల ద్వారా చట్టసభల నాణ్యత పెరిగి ఆయా వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుంది అనుకుంటే, రిజర్వుడ్ సీట్లలో ఎన్నిక కాబోతున్న వారు ఆయా రాజకీయ పార్టీల వంగ మా గదులే తప్ప వ్యక్తిత్వం, వ్యక్తిగతం ఎక్కడా కనపడదు. కనీసం చదువుకున్న, విజ్ఞానవంతులైనా ఉన్నారా అంటే ఒక శాతం కూడా కనపడరు.నేడు రాజకీయాలకు అర్హత చదువు సంధ్యలు కాదు డబ్బు, నాయకుని వద్ద విధేయత మాత్రమే. అందుకే ఈ ప్రక్రియ అన్ని రాజకీయ పార్టీలకు సహేతుకమే,ఎందుకంటే దీనివల్ల రాజకీయ నిరుద్యోగం తీరి,ఎక్కువమందిని సంతృప్తి పరుస్తుంది. ఈ ప్రక్రియ ప్రక్రియ కేవలం కొన్ని గుంపుల ప్రయోజనాలు నెరవేర్చే ప్రక్రియగా మిగిలిపోతుంది.

ఒకవేళ ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ,మహిళ ల ప్రాతినిథ్యం పెరిగి సమానత్వం సిద్ధిస్తుంది అనుకుంటే,వారి స్థాయిని రాజకీయ పార్టీలే నిర్ణయిస్తాయి కాబట్టి అది కూడా జరగడానికి వీలు లేదు. ఈ ప్రక్రియ వల్ల కేవలం ఆయా రాష్ట్రాలు, నియోజకవర్గాల భౌగోళిక స్వరూపాలు మారతాయి,ప్రజా ప్రతినిధుల సంఖ్య పెరుగుతుంది,తద్వారా అధికార పరిధి పెరిగి,ప్రజల పీడన సహజ వనరుల దోపిడీకి అనుకూలంగా మారుతుంది.

ఈ ప్రక్రియ ద్వారా అధికారంలో ఉన్నవారు తమ పలుకుబడిని ఉపయోగించి ఇష్టారాజ్యంగా నియోజకవర్గాల విభజనచేసి,తమ వ్యతిరేక ఓటర్లను తొలగింప చేసుకుంటారు. నియోజకవర్గాల పరిధి తగ్గడం వల్ల పాలనా సౌలభ్యం పెరుగుతుంది అన్నమాటే వాస్తవం,అయితే ఇప్పటికే పునర్విభజన జరిగిన నియోజకవర్గాలలో ఎందుకు కనబడదు.

ఈ ప్రక్రియ రాజకీయ పార్టీలకు మాత్రమే ఉపయోగ కాబట్టి అన్ని రాజకీయ పార్టీలు ఒకే త్రాటిపై నిలబడతాయి. వడ్డించేవాడు తనవాడు అయినప్పుడు బంతి చివరలో కూర్చున్నా కడుపు నిండుతుంది అన్నట్లు,ఈ ప్రక్రియ ఏ ప్రభుత్వం నాయకత్వం కింద జరుగుతుందో వారికి ఎక్కువ మేలు జరుగుతుంది. దీనిని ఒక ఘనకార్యంగా చెప్పుకుంటున్న రాజకీయ పార్టీలు,ఈ ప్రక్రియ వల్ల ప్రజలకు జరిగే ప్రయోజనాలు ఏమిటో కూడా చెప్పాలి.

**- కెవి రమణ, రాజకీయ విశ్లేషకులు, అనంతపురం.**

# పేదల కన్నీళ్లు తుడిచిన సేవలే ఆర్డీటీకి కవచం

### ఆర్డిటీ సేవలకు లోకేష్ చొరవతో అడ్డంకుల తొలగింపు..
### పేద ప్రజలకు నిజమైన ఉగాది, శ్రీరామనవమి పండుగ నేడు..
### ఫెర్రర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన ధర్మవరం నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ..



ఫాదర్ ఫెర్రర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్, నాయకులు

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 26 :**
పేదల కన్నీళ్లు తుడిచిన సేవలే ఆర్డీటీ సంస్థను ఈరోజు నిలబెట్టాయని, ఆ సేవలే సంస్థకు కవచంలా మారాయని ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ రీన్యువల్‌కు అనుమతి ఇవ్వడం ఆ సేవలకు వచ్చిన గౌరవమని పేర్కొన్నారు. గురువారం బత్తలపల్లి లోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ను ఆయన సందర్శించి,పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రి వద్ద, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు నాయకులు,కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొని మిఠాయిలు పంచుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఐదు దశాబ్దాలుగా అనంతపురం జిల్లాలో నిరుపేదలకు అండగా నిలుస్తూ ఆర్డీటీ వేలాది కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టిందన్నారు. పేద విద్యార్థులకు విద్యను అందించి, ప్రతిభావంతులకు ప్రోత్సాహం ఇచ్చి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యాన్ని అందించి, ప్రతి ఇంటిలో ఆశాకిరణంగా నిలిచిందని, అసలు ఆర్డిటి సాయం పొందని కుటుంబం దాదాపు ఉండదన్నారు.

కరోనా సమయంలో ఉన్నత వర్గాలు సైతం ఇక్కడ చికిత్సలు పొందాలని గుర్తు చేశారు. అలాంటి సంస్థకు కష్టం వచ్చినప్పుడు ఇది ప్రజలకొచ్చిన కష్టముగా ప్రభుత్వం భావించిందన్నారు. మన ప్రాంత ప్రజల కన్నా ఎక్కువగా బంధం పెంచుకున్న ఆర్డిటి సంస్థకు నిధుల సమస్య తలెత్తిన వేళ మంత్రి నారా లోకేష్ ముందుండి ఢిల్లీ స్థాయిలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లతో చర్చలు జరిపి ఎఫ్‌సీఆర్‌ఏ రీన్యువల్ సాధ్యమయ్యేలా కృషి చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో ఆ సంస్థ సేవలకు ఎక్కడ ఆటంకాలు కలుగకూడదన్న ఉద్దేశంతో ఢిల్లీ స్థాయిలో అనేక సంప్రదింపులు మంత్రి నారా లోకేష్ జరిపారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు పరిస్థితిని వివరించి, ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ అయ్యేలా ప్రభుత్వం అండగా నిలిచి విదేశీ నిధుల అడ్డంకులను తొలగించిందన్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు ఆర్డీటీని కన్నతల్లిలా భావిస్తున్నారని, ప్రజా పోరాటాల మధ్య పెరిగిన ఈ సంస్థ సేవలు ఎప్పటికీ నిలిచిపోవని శ్రీరామ్ అన్నారు. ఆర్డీటీకి కష్టం వస్తే అది ప్రజలకే కష్టమని భావించిన ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ ప్రకటన వలన ఇన్ని రోజులు ఆందోళన చెందిన పేదలకు నిజమైన ఉగాది, శ్రీరామనవమి పండుగలు వచ్చినట్లుగా భావిస్తున్నారన్నారు. ఆర్డిటి సంస్థ అందించే సేవలకు ఎల్లలు ఉండవని... వాటికి అంతరాయం కూడా ఉండదన్నారు.

భవిష్యత్తులో కూడా ఆర్డీటీ సేవలు మరింత విస్తరించి పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, క్లస్టర్ ఇంచార్జు నెట్టెం రమణ, కాకర్ల సురేంద్ర నాయుడు, యూనిట్ ఇంచార్జ్ బత్తల మనోజ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అయ్యప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, ఎర్రాయి పల్లి చల్ల శ్రీనివాసులు బోయపాటి రాము, పల్లపోతుల శ్రీరాములు, దేరంగుల హరి, శ్రీనివాస్, ప్రతాప్, సాకే వీర, ఎల్ ఎస్ సుభాన్, వెంకటరాముడు, అప్రా చెరువు సూర్యనారాయణ, బొజ్జప్ప, రమణప్ప, దామోదర్, దిలీప్, కుంటాల బాలకృష్ణ, ఉమ్మాల చంద్రశేఖర్, అప్ప స్వామి, బాబు, రాఘవంపల్లి మండల శ్రీనివాసులు, సాకే రాజగోపాల్, రాజు, హరి, శీన తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫాదర్ ఫెర్రర్, పీఎం , సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పరిటాల శ్రీరామ్,నాయకులు

# మండలంలో శ్రీరామనవమి శోభ..

### ముస్తాబైన రామాలయాలు..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 26 :**
మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం పండుగను పురస్కరించుకుని మండలంలోని రామాలయాలన్నీ విద్యుత్ దీపాలు, పుష్ప అలంకరణలతో అద్భుతంగా ముస్తాబయ్యాయి. ఆలయాల చుట్టూ భక్తి వాతావరణం నెలకొని, గ్రామాలన్నీ పండుగ శోభతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంఘమేశ్వర క్షేత్రంతో పాటు పోట్లమర్రి, బత్తలపల్లి, లింగారెడ్డిపల్లి, రాఘవంపల్లి, ముష్టూరు తదితర గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో శుభ్రత, అలంకరణలతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఇక గంటాపురం, లింగారెడ్డిపల్లి, గుమ్మలకుంట, నెత్తివారంపల్లి, కాటమకుంట గ్రామాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం పొందడంతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు.



కోట్లమరిలో విశేష పూజలు అందుకుంటున్న సీతారామలక్ష్మణులు



విద్యుత్ అలంకరణలో గంటాపురం సీతారామచంద్ర స్వామి ఆలయం

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**అమరాపురం (తెలుగోడు), మార్చి 26 :**
అమరాపురం దక్షిణ గొల్ల హట్టిలో శ్రీరామ నవమి వేడుకలను గురువారం యాదవ యువక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. శ్రీరామనవమి వేడుకల సందర్భంగా శ్రీ రాముని చిత్రపటానికి ,పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో పూజలు అర్చకులు రాజప్ప స్వామి, మంజు స్వామి నిర్వహించారు. యాదవ యువకులు గజ, శివరాజు, భరత్, రవిబాబు, రవి, తదితరులు అందరూ కలిసి ఉత్సాహంతో, ఉల్లాసంతో వేడుకలను జరుపుకున్నారు. యాదవ యువకు సంఘం ఆధ్వర్యంలో పానకం, పెసర బేడలు, మజ్జిగ తదితర వాటిని భక్తాదుల కు ప్రజలకు అందజేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీరామ నవమి వేడుకలను జరుపుకున్నారు.



శ్రీరాముని చిత్తపటానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు





శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు. భక్తాదులకు పానకం, పెసర బేడలు, మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం.



మట్టి నమూనా పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎ ఓ వెంకటబ్రహ్మం

## మట్టి నమూనా ప్రాముఖ్యతపై అవగాహన

**రొళ్ల (తెలుగోడు), మార్చి 26 :**
వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నాచురల్ ఫార్మింగ్ సిబ్బందికి గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని రైతులకు మట్టి పరీక్షల ప్రాముఖ్యతపై వ్యవసాయధికారి వెంకటబ్రహ్మం అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మండలంలోని మొత్తం 11 రైతు సేవా కేంద్రాలకు పరిధిలో ఉన్న గ్రామాల రైతుల నుండి మొత్తం 862 మట్టి నమూనాలు సేకరించారు. సేకరించిన నమూనాలను మట్టి పరీక్షల నిమిత్తం కర్నూల్ లోని సాయిల్ టెస్టింగ్ అనాలసిస్ ల్యాబ్, కు పంపించడం జరుగుతోందని తెలిపారు. మట్టి పరీక్షల ఫలితాలు అందిన తర్వాత, సంబంధిత రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్డుల ద్వారా రైతులు వారి భూమి పోషక స్థితిని సులభంగా అర్థం చేసుకొని, ముఖ్యంగా ఎన్‌పీకే (నత్రజని, ఫాస్పరస్, పొటాష్) వంటి స్థూల పోషకాల వినియోగాన్ని శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించవచ్చన్నారు. ఈ విధంగా మట్టి పరీక్షల ఆధారంగా వ్యవసాయం చేయడం వల్ల ఎరువుల వినియోగం సమతుల్యం అవడంతో పాటు, ఖర్చులు తగ్గి పంటల దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సి.వెంకట బ్రహ్మం తెలిపారు. ఈ కార్యక్రమం రైతులకు శాస్త్రీయ వ్యవసాయం వైపు దారితీసే ముఖ్యమైన చర్యగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎ ఇ ఓ చంద్రకళ రైతులు పాల్గొన్నారు.

## మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి


**హైదరాబాద్, మార్చి 26 :**
మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో పలువురు మంది మృతి చెందడం.. కొందరికి తీవ్ర గాయాలపాలవడంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు. బస్సు నిర్మల్ నుంచి నెల్లూరు వైపు వెళుతున్న నేపథ్యంలో బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారు.. గాయపడిన వారి వివరాలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు.

# రాంచరణ్ కంటికి స్వల్ప సర్జరీ.. డాక్టర్‌కు చిరు కృతజ్ఞతలు

పెద్ది' సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా రామ్ చరణ్ కంటికి గాయం కావడంతో, మెగా కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ కొంత ఆందోళన నెలకొంది. అయితే, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ సర్జరీ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా డాక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సమయంలో తమకు కలిగిన ఆందోళనను డాక్టర్ తన మాటలతో, పనితనంతో పోగొట్టారని ఆయన వివరించారు.డాక్టర్ సుధాకర్ ప్రసాద్ గారు, చరణ్ కంటికి మీరు ఎంతో నైపుణ్యంతో, సకాలంలో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. తొలుత మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ.. మీరు చెప్పిన మాటలు మా భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చాయి. సకాలంలో స్పందించి చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు. తండ్రిగా తన కొడుకు ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధను, వైద్యుడిపై ఉన్న గౌరవాన్ని ఈ పోస్ట్ ద్వారా చిరంజీవి చాటుకున్నారు. సర్జరీ విజయవంతం కావడంతో రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల సూచనల మేరకు కొద్దిరోజుల విరామం తర్వాత ఆయన తిరిగి 'పెద్ది' షూటింగ్‌లో పాల్గొననున్నారు. అయితే, మెగాస్టార్ స్వయంగా అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకుని, రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పెద్ది టీమ్ కూడా స్పందించింది. చరణ్ తిరిగి షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్టుగా తెలిపింది. గాయం చిన్నదే కావడంతో సినిమా పనులకు పెద్దగా ఆటంకం కలగదని రామ్ చరణ్‌తో పాటు చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న పెద్ది రిలీజ్ కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.



# వివక్ అగ్నిహోత్రి మూవీ...ఆపరేషన్ సిందూర్




'ది కాశ్మీర్ ఫైల్స్', 'ది వ్యాక్సిన్ వార్' వంటి వివాదస్పాద చిత్రాలతో సంచలనం సృష్టించిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించాడు. 'ఆపరేషన్ సిందూర్' అనే టైటిల్‌తో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం కోసం ఆయన ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్‌తో (టీ-సిరీస్) చేతులు కలిపినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ 'టైనీ' ధిల్లాన్ రాసిన  పుస్తకం ఆధారంగా తెరకెక్కుతోంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, భారత సాయుధ దళాలలోని వివిధ విభాగాలు సమన్వయంతో సాగించిన లోతైన పరిశోధనల ఆధారంగా ఈ కథను రూపొందించారు. కేవలం శబ్దం చేయడం కోసం కాకుండా, వాస్తవాలను క్లారిటీతో, సినిమా మాయాజాలంతో ప్రపంచానికి చాటి చెప్పడమే తమ లక్ష్యమని వివేక్ అగ్నిహోత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. పల్లవి జోషి, వివేక్ అగ్నిహోత్రి తమ 'ఐ యామ్ బుద్ధ' ప్రొడక్షన్స్‌పై టీ-సిరీస్‌తో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు

# ఉస్తాద్‌లో పవన్ కళ్యాణ్ ఎంట్రీ అదుర్స్ ప్రేక్షకుల స్పందనపై హరీష్ కామెంట్స్

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'సినిమాలో పవన్ ఎంట్రీ సీన్‌పై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోల్స్‌పై హరీశ్ శంకర్ స్పందించారు. ఆయన జీప్‌లో నుంచి రెండుసార్లు దిగడం ఒకే సీన్‌లో చూపించారని కొందరు విమర్శించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ తనకు రెండు ఎంట్రీలు నచ్చాయని అందుకే పెట్టినట్లు తెలిపారు. కొన్నికొన్ని సన్నివేశాల్లో స్వేచ్ఛ తీసుకుంటా. ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ (ఖజీలిజీని ఐజీ÷ూజీని) ఫస్ట్ జీప్‌లో నుంచి దిగుతారు. ఆ సమయంలో ఒక బాడీ పడుతుంటే ఆయన దిగడం చూపించా. ఆ తర్వాత మళ్లీ జీప్ నుంచి జంప్ చేస్తూ కిందకు వస్తారు. ఇదేంటి రెండుసార్లు ఎలా దిగారని కొందరు అన్నారు. అలాంటివి పట్టించుకోను. నాకు రెండు షాట్లూ నచ్చాయి. నేను ఒక షాట్ తీశా. మాస్టర్ ఇంకోటి తీశారు. రెండూ బాగున్నాయి అనిపించింది. నచ్చాయి అంటే లాజిక్‌లను పట్టించుకోను. 'ధురంధర్ 2' కలెక్షన్స్ చూసి నాకు  కూడా ఆనందంగానే ఉంది. మీరు గమనిస్తే.. నేను ఉస్తాద్‌లో చూపించిన దేశభక్తిని ఆదిత్యధర్ పూర్తిస్థాయిలో 'ధురంధర్ 2'లో చూపించారు. నా భావాలతో నాకు నచ్చిన సినిమా.. నా చిత్రం కంటే బాగా హిట్ అవుతోంది అన్నప్పుడు ఒకరకమైన ఆనందం ఉంటుంది కదా.. నేను ఇప్పుడు అదే సంతోషంలో ఉన్నాను. మనమందరం సినిమా లవర్స్. ఏ సినిమా విజయం సాధించినా ఆనందమే. ఇన్నేళ్ల నా కెరీర్‌లో చాలా తక్కువ సినిమాలు చేశాను. నేను తొమ్మిది సినిమాలు చేస్తే.. దాదాపు 10 చిత్రాలు క్యాన్సిల్ చేశా. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. స్క్రిప్ట్ కుదరకపోవడం, హీరో చివరి నిమిషంలో క్యాన్సిల్ చేయడం.. ఇలా ఎన్నో ప్రాజెక్ట్‌లు చేయలేకపోయా. ఎన్టీఆర్‌తో 'ఎంఎల్‌ఏ' చేద్దాం అనుకున్నా. కానీ, కుదర్లేదు. క్యాన్సిల్ అయిన ప్రాజెక్ట్‌లకు వర్క్ చేసి కూడా పట్టాలెక్కించలేకపోయా. ఇకనుంచి అలా జరగదు. చాలా కథలు రాసుకున్నా. వరుసగా తెరకెక్కిస్తాను.




# ధురంధర్  దుష్ప్రచారంపై చర్యలు తప్పవు



దర్శకుడు ఆదిత్య ధర్ తన తాజా చిత్రం 'ధురంధర్: ది రివెంజ్' పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై స్పందించారు. నెట్టింట వైరల్ అవుతున్న ఒక మార్ఫింగ్ ఫోటోపై ఆయన స్పష్టతనిచ్చారు. అది సినిమాకు సంబంధించినది కాదంటూ పోస్ట్ పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా 'ధురంధర్2' చిత్రానికి లభిస్తోన్న ఆదరణ చూసి నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది. అయితే, కొంతమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి మా అధికారిక ప్రోమోలను మారుస్తూ తప్పుడు కథనాలను సృష్టిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా, ఈ చిత్రంలోని హంజా (జస్కీత్) పాత్ర తలపాగా ధరించి సిగరెట్ తాగుతున్నట్లు ఉన్న ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది పూర్తిగా అబద్ధం. మా సినిమాలో కానీ, మేము విడుదల చేసిన ఏ ఇతర అధికారిక వీడియోల్లో కానీ అలాంటి సీన్ లేదు. ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించాలని కొందరు చేస్తోన్న పని. సిక్కులు అంటే నాకెంతో గౌరవం. ఈ చిత్రంలో ప్రతి పాత్రను ఎంతో బాధ్యతతో వారిపై గౌరవంతోనే చిత్రీకరించాం. ఏఐతో సృష్టించిన ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరుతున్నాను. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటాను అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కిన 'ధురంధర్ 2' మార్చి 19న విడుదలైంది. తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఏడు రోజుల్లో రూ.1000కోట్ల క్లబ్‌లో చేరినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకూ రూ.1,006 కోట్లు తన ఖాతాలో వేసుకుంది.

# తెరపైకి మరో రామాయణ కావ్యం




భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుంది జాతీయ అవార్డు గ్రహీత, దర్శకురాలు భావనా తల్వార్. ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'వాల్మీకి రామాయణం'. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. భక్తి మరియు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శ్రీరాముడి పాదాలను చూపించడం విశేషం. 'పర్వతాలు ఉన్నంత కాలం, నదులు ప్రవహించినంత కాలం రామాయణం జీవించే ఉంటుంది' అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. చాలా ఏండ్ల తర్వాత భావనా తల్వార్ మెగాఫోన్ పట్టి ఈ సినిమా తెరకెక్కిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తుండగా.. బినోద్ ప్రధాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. రసూల్ పూకుట్టి సౌండ్ డిజైన్ అందిస్తున్నాడు. ఆనంద్ నీలకంఠన్ మరియు చంద్రప్రకాష్ ద్వివేది కథను అందిస్తున్నారు. మరోవైపు ఈ భారీ పౌరాణిక చిత్రం గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada,  ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No -  99634 96956,  73827 12780.